Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 258 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 అక్టోబర్ 2023 శనివారం పేజీలు : 4

## బీజేపీ రాజకీయాలను దిగజార్చుతోంది

### నిప్పులు చెరిగిన ప్రియాంక గాంధీ

ఢిల్లీ: భారతీయ జనతా పార్టీ రాజకీయాలను నానాటికీ దిగజార్చుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంక గాంధీ విమర్శించారు. బీజేపీ తన ఎక్స్ హ్యాండిల్ లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటోను మార్ఫింగ్ చేసి రావణుడిలా మార్చింది. దీంతో రెండు జాతీయ పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రియాంక ఎక్స్ లో "ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా రాజకీయాలను దిగజార్చుతున్నారు. హింసాత్మక ఫొటోలతో గొడవలు సృష్టించాలని చూస్తున్నారు. మీరు నిజాయతీగా, విలువలతో కూడి ఉంటామని ప్రమాణం చేశారు. ఇదేనా మీ నిజాయతీ, విలువలు?" అని ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ నడుమ ఎక్స్ లో పోస్టర్ వార్ జరుగుతోంది. ప్రధాని మోదీని.. జుమ్లాబాయ్, అతిపెద్ద అబద్ధాల కోరుగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ పార్టీ తొలుత ఎక్స్ లో వ్యంగ్య పోస్టర్లు పెడితే.. 24 గంటలు కూడా తిరక్కముందే రాహుల్‌ను రావణుడిగా అభివర్ణిస్తూ బీజేపీ కాంగ్రెస్ కు దీటుగా సమాధానమిచ్చింది.




# కాంగ్రెస్ బలపడుతోందిగా...!

## బీఆర్ఎస్ - కాంగ్రెస్ హోరాహోరీ !!

# ఎవరికెన్ని సీట్లంటే ?

హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేడి పతాక స్థాయికి చేరుకుంటోంది. అక్టోబర్ 10వ తేదీ లోపే ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం ఖాయంగా కనిపిస్తోంది. 7 లేదా 8వ తేదీల్లో షెడ్యూల్ విడుదల అవుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. సరిగ్గా నెల రోజుల తరువాత పోలింగ్ ఉండొచ్చనే అంచనాలు వ్యక్తమౌతోన్నాయి. వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి అధికార భారత్ రాష్ట్ర సమితి కసరత్తు పూర్తి చేస్తోంది. ఎన్నికల ప్రచార కార్యక్రమాలపై దృష్టి సారించింది. షెడ్యూల్ విడుదల కావడానికి ఎంతో సమయం లేకపోవడం వల్ల అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ముమ్మరం చేసింది. అటు కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ ఈ సమరానికి రెడీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన నాయకుల చేరికతో కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరిగింది. ఇప్పటికే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, మైనంపల్లి హన్మంతరావు, వేముల వీరేశం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ పరిణామాల మధ్య తాజాగా అసెంబ్లీ ఎన్నికల సర్వే నివేదిక ఒకటి వెలుగులోకి వచ్చింది. లోక్‌పోల్ నిర్వహించిన సర్వే అది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజేత ఎవరనేది అంచనా వేసిందా సంస్థ. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా వాటి ఫలితాలను విడుదల చేసింది. ఓ లోక్‌సభ పరిధిలో ఉండే అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ పార్టీకి ఎన్ని వస్తాయనేది తెలియజేసింది. టెక్కీకి లక్షల్లో జీతం, కేరళ వెళ్లి మలయాళం మసాజ్ చేసుని వస్తే ఇంట్లో ?, సీసీటీవీల్లో ! ఈ రిపోర్ట్ బట్టి చూస్తే- ఈ దఫా తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది. కాంగ్రెస్- 61 నుంచి 67 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటుందని ఈ సర్వేలో తేలింది. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ 41 నుంచి 44 వరకు ఓట్ల శాతాన్ని నమోదు చేసుకుంటుంది ఈ సర్వే నివేదికను బట్టి చూస్తే. అధికార భారత్ రాష్ట్ర సమితికి పరాభవం తప్పదని అంచనా వేసింది. వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్ చేస్తోన్న ప్రయత్నాలు ఫలించబోవని పేర్కొంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్- 45 నుంచి 51 స్థానాలకే పరిమితం అవుతుంది. ఆ పార్టీకి పడేది 39 నుంచి 42 శాతం ఓట్లు. బృహస్పతి తిరోగమనంతో ఊహించని మార్పులు.. ఈ రాశులవారు మహారాజులే భారతీయ జనతా పార్టీ మాత్రం దారుణ పరాజయాన్ని చవి చూడటం ఖాయమైంది. బీజేపీ గెలిచేది 2-3 మూడు చోట్ల మాత్రమే. 10 నుంచి 12 శాతం ఓట్లు మాత్రమే బీజేపీకి పోల్ అవుతాయి. ప్రతిపక్ష హోదా కూడా బీజేపీ దక్కబోదని లోక్‌పోల్ సర్వే స్పష్టం చేసింది. మజ్లిస్ తన పట్టును కొనసాగిస్తుంది. 6 నుంచి 8 సీట్లను సొంతం చేసుకోగలుగుతుంది.

## రెబెల్స్‌కు పదవులు... మోడీ ప్లాన్ వర్కవుట్ అయ్యేనా



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో నేడో రేపో ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందనే రీతిలో ఇటు అధికార యంత్రాంగం అటు రాజకీయ పార్టీలు సన్నద్ధం అవుతున్న సంగతి తెలిసిందే. అన్ని పార్టీలు తమతమ ఎత్తుగడలతో సిద్ధమవుతున్నాయి. అయితే తెలంగాణలో సత్తా చాటుకోవాలని భావిస్తున్న బీజేపీని అసంతృప్తి నేతల కుంటటి బాధిస్తోంది. ఇలాంటి తరుణంలో బీజేపీ పెద్దలు కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పట్ల నారాజ్ అయిన నేతలందరికీ దాదాపు ఏదో ఒక పదవి కట్టబెడుతూ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ చర్య ఫలితం ఎంతమేరకు ఇస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఈటల రాజేందర్‌కు బీజేపీ పెద్దలు ప్రాధాన్యత ఇవ్వడం బీజేపీలోని కొందరు నేతలకు నచ్చట్లేదని అంటున్నారు. మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జి.వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి, జి.విజయరామారావుతో పాటు పలువురు నేతల పేర్లు ఈ జాబితాలో వినిపిస్తున్నాయి. అసంతృప్త నేతలంతా తరచూ రహస్య సమావేశాలు నిర్వహించడంతో బీజేపీ పెద్దలు కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వారందరికీ తలా ఓ పదవి అప్పజెప్పారు. తద్వారా పార్టీ పనుల్లో బిజీ అయ్యేలా చేశారు. బీజేపీ వ్యూహకర్త బీఎల్ సంతోష్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో తాజాగా ఎన్నికల కమిటీలను నియమిస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణను మొత్తం ఆరు జోన్లుగా విభజించుకొని మొత్తం పద్నాలుగు కమిటీలను బీజేపీ నియమించింది. ఒక్కో జోన్ కు ఒక్కో నేతను నియమించి పార్లమెంట్, శాసన సభ నియోజక వర్గాల వారీగా కీలక నేతలకు బాధ్యతలను అప్పగించారు. కీలకమైన మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ గా వివేక్ వెంకట స్వామి, కన్వీనర్ గా మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కన్వీనర్ గా కొండా విశ్వేశ్వర్ రెడ్డిని నియమించింది. స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ గా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పబ్లిక్ మీటింగ్స్ కమిటీ ఛైర్మన్ గా బండి సంజయ్, నిరసనల కమిటీ ఛైర్మన్ గా విజయశాంతి, ఛార్జ్‌షీట్ కమిటీ ఛైర్మన్ గా మురళీధరరావుని నియమించింది. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఎలాంటి వ్యూహాలు పన్నాలి, మేనిఫెస్టో రూపకల్పన, బహిరంగ సభల నిర్వహణ, పబ్లిసిటీ, నిరసనల వంటి కార్యక్రమాలను ఈ కమిటీలు చేపట్టనున్నాయి. అయితే, ఇందులో పదవులు దక్కిన నేతలు ఎంత మేరకు పార్టీకి సహకరిస్తారు? ఎంత మేరకు వారికి నిర్దేశించిన పనులను చేస్తారు అనేది తేలాలంటే... ఎదురుచూడాల్సిందే.

## సీఎం బ్రేక్‌ఫాస్ట్‌తో విద్యావ్యవస్థలో సమూల మార్పులు: మంత్రి హరీశ్ రావు



రంగారెడ్డి: ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ కార్యక్రమం చేసినా దానివెనక మానవీయ కోణం ఉంటుందని మంత్రి హరీశ్ రావు అన్నారు. బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం పేద పిల్లలకు వరమని చెప్పారు. దేశంలో ఇలాంటి అల్పాహార పథకం ఎక్కడాలేదన్నారు. ఇంగ్లిష్ మీడియంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. వెయ్యి గురుకులాలు ఉన్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఆడపిల్ల చదువుకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా 20 లక్షల మంది విద్యార్థులకు లబ్ధిచేకూరుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల తరుపున సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని మంత్రి చెప్పారు. దేశంలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందించే ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని, ఇది విద్యావ్యవస్థలో సమూల మార్పుతెస్తుందన్నారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న అన్ని పథకాలు సూపర్ హిట్ అని, ఒక పథకం అమలుచేసే ముందు ప్రజాకోణంలో ఆలోచిస్తారని చెప్పారు. అందుకే అవి విజయవంతం అవుతున్నాయని, సామాజిక మార్పునకు కారణమవుతున్నాయని తెలిపారు. కళ్యాణ లక్ష్మి రూ.లక్ష ఇచ్చే పథకం మాత్రమే కాదని, అది బాల్య వివాహాలను తగ్గించిందని చెప్పారు. చట్టాలతో సాధ్యంకానిది ఒక పథకం చేసిందన్నారు. కేసీఆర్ కిట్ 16 వస్తువులు ఇచ్చే పథకం మాత్రమే కాదు.. వంద శాతం ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలు జరుగుతున్నాయని వెల్లడించారు. మిషన్ భగీరథతో సురక్షిత తాగునీరు అందుతున్నదని, తద్వారా సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయన్నారు. ఇప్పుడు సీఎం బ్రేక్‌ఫాస్ట్ కేవలం విద్యార్థుల కడుపు నింపే కార్యక్రమం మాత్రమే కాదని.. స్కూల్స్‌లో డ్రాప్ ఔట్స్ తగ్గించి, బడి బాట పట్టించి, విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు తెచ్చే పథకమని చెప్పారు. 9, 10 తరగతుల విద్యార్థులకు దేశంలో మనం మాత్రమే భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. దసరా తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా బ్రేక్ ఫాస్ట్ పథకం అమలు అవుతుందని హరీశ్ తెలిపారు.



**మానవీయ కోణంలో..** మానవీయ కోణంలో పేద విద్యార్థులకు ప్రవేశపెట్టిందే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకమని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామని వెల్లడించారు. విద్యాశాఖపై ప్రత్యేక శ్రద్ధవహిస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఇడ్లీ తినిపించిన మంత్రి హరీశ్ రావు సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మంత్రి హరీశ్ రావు లాంఛనంగా ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఈ కార్యక్రమాన్ని ఆరంభించారు.

# పోరాటాల పుట్టిల్లు

# 'పోరు'గల్లు



## ఎన్నటికీ ఓరుగల్లు రుణం తీర్చుకోలేం! - మంత్రి కేటీఆర్

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మంత్రి కేటీఆర్

వరంగల్ : తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్, హనుమకొండనే కదన రంగమైంది.. ఉద్యమానికి కేంద్ర బిందువైంది అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. పార్టీకి ఎప్పుడు బలం కావాలన్న మనం అతిపెద్ద ప్రజాగర్జన, బహిరంగ సభ ఇదే వరంగల్ గడ్డ, హనుమకొండ నియోజకవర్గంలో పెట్టుకున్నాం. 23 ఏండ్లలో ఎన్నో సందర్భాల్లో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదింది ఈ ఓరుగల్లు గడ్డనే. మీకందరికి రుణపడి ఉంటాం. ఓరుగల్లు బిడ్డలకు శిరసు వంచి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వరంగల్‌లో వేల కోట్ల రూపాయాలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలు రాగానే సంక్రాంతికి గంగిరెద్దుళ్లోళ్లు వచ్చినట్లు ప్రతిపక్షాలు వస్తాయి. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు.. కేసీఆర్ పథకాలను కాపీకొట్టి, నాలుగు ఓట్లు డబ్బాలో వేయించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. చరిత్రలో వాస్తవాలు దాచిన దాగవు అని మంత్రి తెలిపారు. 1956లో హైదరాబాద్ సంస్థానం ఒక రాష్ట్రంగా ఉంటే.. బలవంతంగా తీసుకుపోయి ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్సే. 1968లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఖమ్మం, వరంగల్‌లో అందరూ కలిసి కదం తొక్కితే, ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడితే ఆ రోజు కర్కశకంగా 370 మంది పిల్లల్ని పిట్టల్లా కాల్చి చంపింది కాంగ్రెస్ పార్టీనే. తెలంగాణ ప్రజలు 1971లో మర్రి చెన్నారెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రజా సమితికి ఆనాటి పార్లమెంట్ ఎన్నికల్లో 14 స్థానాలకు గానూ 11 స్థానాలను గెలిపించారు. మొత్తం భారతదేశానికి వినపడేటట్టు తీర్పు ఇచ్చారు. మా తెలంగాణ మాకు ఇవ్వాలని ఇందిరా గాంధీని డిమాండ్ చేశారు. మళ్లీ మోసం చేసి 11 మంది ఎంపీలను కాంగ్రెస్‌లో కలుపుకున్నారు. తెలంగాణ వాదాన్ని తొక్కేశారు. మళ్లీ 30 ఏండ్ల తర్వాత గులాబీ జెండా 2001లో ఎగిరితే.. మళ్లీ అదిరిపోయి తెలంగాణ నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ అందిపుచ్చుకుంది. తెలంగాణ ఇస్తామని 2004లో మాటిచ్చింది. తెలంగాణ తప్పకుండా ఇస్తామని నమ్మబలికి పొత్తు పెట్టుకుంది. అలా 2004 నుంచి 2014 వరకు పదేండ్లు సావగొట్టింది.

వేల మంది చావులను కండ్ల చూసింది. మీ అందరి పోరాటంతో ప్రజాశక్తి ముందు తలవంచక తప్పని పరిస్థితి వస్తే అనివార్యంగా కాంగ్రెస్, బీజేపీ కలిసొచ్చాయి. విధి లేని పరిస్థితుల్లోనే తెలంగాణ జపం చేశారని కాంగ్రెస్, బీజేపీపై కేటీఆర్ ధ్వజమెత్తారు.

## సంపాదకీయం

# అమెరికాలో వరదొస్తే...
## ఆఫ్రికాకు ఎంత కలిసొస్తుందో తెలుసా?

వానొచ్చెనంటే వరదొస్తది.. వరదొచ్చెనంటే బురదొస్తది.. బురదలో దొర్లితే దురదొస్తది.. అనేది పాత మాట.! అమెరికాలో వానొచ్చెనంటే వరదొస్తది.. అక్కడ వరదొచ్చెనంటే ఆఫ్రికాకు బాగా కలిసొస్తది అనేది కొత్త మాట.! ఇదేదో ప్రాస కోసం వాడుతున్న మాట.. యతికోసం రాస్తున్న మాటో కాదు సుమా... ఇది అక్షరాలా నిజం.. అమెరికా కార్ల మీద ఒట్టు! అవును... అమెరికాలో వరదలొస్తే ఆఫ్రికాకు బాగా కలిసి వస్తుంది. దానికి కారణం కార్ల వ్యాపారం. సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం. బెంజ్, బీ.ఎం. డబ్ల్యూ, ఆడీ, జాగ్వార్, ఫోర్డ్, హ్యూండాయ్, లూంబెర్గనీ... కంపెనీతో సంబంధం లేదు, మోడల్‌తో అసలు సంబంధం లేదు... వరదలో తడిసిందా, ఆఫ్రికాకు తరలించాల్సిందే..! ఇలా చూపించీ చూపించనట్లు, వినిపించీ వినిపించనట్లు, కనిపించీ కనిపించనట్లు చెప్పుకోవడం ఎందుకు కానీ... డైరెక్ట్‌గా మేటర్ లోకి వెళ్లిపోదాం! ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాలు వరదలో నిండిపోతున్న సంగతి తెలిసిందే. ఇక అగ్రరాజ్యం ఆర్థిక రాజధాని న్యూయార్క్ సిటీ రోడ్లయితే నదీపాయలను తలపిస్తున్నాయి. దీంతో నగర వాసులు ఇళ్లల్లోంచి మరీ అవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది. ఆ సంగతి అలా ఉంటే... ఈ వరద నీటిలో వీదుల్లో ఉన్న కార్లు, పార్కిం స్థలాల్లో ఉన్న వాహనాలు అన్నీ నీట మునిగిన సంగతి తెలిసిందే. ఇలా నీటిలో మునిగి, ఇంజిన్ తడిచిన వాహనాలను అమెరికన్లు తిరిగి వాడరు! అవును... ఒకసారి వరద నీళ్లలో ఇంజిన్ తడిస్తే.. ఆ కారును అమెరికాలో ఎవరూ ముట్టుకోరట. సాధారణంగా లక్షన్నర డాలర్ల నుంచి 2 లక్షల డాలర్ల వరకు ఉండే లగ్జరీ కార్లను సైతం వారు లైట్ తీసుకుంటారంట. ఇదే సమయంలో ఎంత ఖరీదైన కారైనా... దాని ఇంజిన్ ఒక్కసారి వరద నీటిలో తడిస్తే... దాని ధర అమాంత పడిపోతుందంట. అది కూడా అత్యంత దారుణంగా... ఉదాహరణకు లక్షన్నర డాలర్లు ఉన్న లగ్జరీ కారు ఇంజిన్ వరదనీటిలో మునిగి నానిపోతే దాని ధర 5వేల డాలర్లకు పడిపోతుందంట. దీంతో... ఇలాంటి కార్లన్నింటిని ఓనర్లు ఇన్సూరెన్స్ వాళ్లకు అప్పగించేసి కొత్త కార్లను తీసుకుంటారట. ఈ క్రమంలో అది ఎంత ఖరీదైన కారైనా చాలా తక్కువ ధరకు జంక్ యార్డ్ లు లేదా వెహికల్ రీబిల్డర్ లకు వేలంలో విక్రయిస్తారట. ఈ క్రమంలో ఇలాంటి వాటిని కొనుగోలు చేసిన రీసెల్లర్ కంపెనీలు.. ఆ కార్లను.. కెన్యా, జింబాంబ్వే, నైజీరియా వంటి దేశాలకు ఎగుమతి చేస్తారు. వరదలో నానడం వల్ల డ్యామేజ్ అయిన ఇంటీరియర్, సీట్ కవర్స్, మేట్ లను చైనా మెటీరియల్ తో కవర్ చేస్తారంట. అలా ఆల్ మోస్ట్ ఎఫ్.ఆర్. వెహికల్స్‌గా కలరింగ్ ఇచ్చి ఆఫ్రికా దేశాలకు తరలించి సుమారు 40వేల డాలర్ల నుంచి 50 వేల డాలర్లకు విక్రయిస్తారని తెలుస్తోంది. ఇలా సుమారు లక్షన్నర నుంచి రెండున్నర లక్షల డాలర్లు విలువ చేసే కార్లను సుమారు 45 నుంచి 50 వేళ డాలర్లకు దొరికే సరికే ఆయా దేశాల్లోని కార్ల ప్రియులు ఎగబడి కొంటారట. ఇలాంటి కార్లు ఎన్ని రోజులు పనిచేస్తాయనే సంగతి కాసేపు పక్కనపెడితే... తక్కువ ధరలో కోరుకున్న కారు కావాలనుకునే వారికి మాత్రం ఇది సువర్ణావకాశమే! ఇలా అమెరికాలో వరద వస్తే ఆఫ్రికా దేశాల్లో... ముఖ్యంగా కెన్యా, నైగర్, జింబాబ్వే, నైజీరియా లాంటి దేశాలు పెద్ద ఎత్తున ఈ కార్లను దిగుమతి చేసుకుంటున్నాయని అంటున్నారు. కాసింత ఖర్చు పెట్టి కొత్తగా తీర్చిదిద్దుతున్నాయట. దీంతో... ఆర్థికంగా వెనుకబడిన ఆదేశాల్లోని వ్యక్తులు 40వేళ డాలర్లకే లోంబెర్గనీలో తిరుగుతారన్నమాట. ఈ బంపరాఫర్ ఏదో బాగానే ఉంది కదా.. మరి మనకు ఆ ఛాన్స్ లేదా అని అంటారా? ఇలాంటి కార్యక్రమాలకు భారత్ అంగీకరించడం లేదని తెలుస్తుంది. అయినా... నేరుగా టెస్లా కార్ల తయారీ యూనిట్ వంటివి ఇండియాలో ఉంటుంటే ఇలాంటి వరద, బురద కార్లు మనకెందుకబ్బా... అని సరిపెట్టుకోవడమే!!

# కసరత్తు ఏది?




ఖమ్మం : మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ప్రతి పురపాలకంలో వీలైనన్ని ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉభయ జిల్లాల్లోని ప్రధాన కేంద్రాలు మినహా మిగిలిన పట్టణాల్లో వీటి ఏర్పాటుపై దృష్టి సారించటం లేదు. క్రీడా మైదానాలు, పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసిన ప్రతిచోటా అందుబాటులో తెచ్చేందుకు వీలున్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. చాలా పురపాలకాల్లో అవసరాలకనుగుణంగా ఓపెన్ జిమ్‌లు లేవు. కొన్నిచోట్ల ఉన్నవాటినీ వినియోగించుకోలేని దుస్థితి.

అధికారులు చెబుతున్నదేంటి? ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు స్థలాల కొరతను బూచిగా చూపుతున్నాయి. ఒక్కో వార్డుకి ఒక్కోటి ఏర్పాటు చేయాలి. మణుగూరు సత్తుపల్లి, వైరా వంటి పురపాలకాల్లో ఒక్కటీ ఏర్పాటు చేయలేదు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే పరికరాలు ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉంది. కాని ఆ అవకాశాన్ని అధికారులు వినియోగించుకోవటం లేదు. దీంతో పట్టణ ప్రజలకు వ్యాయామ సాధన ఇబ్బందికరంగా ఉంది. నెలకు రూ.వందలు ఖర్చుచేసి ప్రైవేట్ జిమ్‌లకు వెళ్లలేక రహదారులు, పాఠశాలల క్రీడామైదానాల్లో నడక సాధన చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. వైరా పురపాలకంలో 20 వార్డులుండగా ఒక్కచోట కూడా ఓపెన్ జిమ్ ఏర్పాటు కాలేదు. జలాశయం ఆనకట్టపై రెండుచోట్ల, వైరా క్రాస్‌రోడ్డులో ఇండోర్ పక్క మరోటి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇండోర్ పక్కన ఓపెన్‌జిమ్ ఏర్పాటుపై కలెక్టర్ పలుసార్లు సూచనలు చేసినా పురోగతి లేదు. స్థానికులకు ఇది అనుకూల ప్రాంతం. జలాశయం ఆనకట్టను రూ.కోట్లతో అభివృద్ధి చేశారు. ఇటుగా వ్యాయామం చేసేందుకు ఎక్కువ మంది వెళ్తున్నా ఓపెన్‌జిమ్ ఏర్పాటు కావడం లేదు. సత్తుపల్లిలో 23 వార్డులకు జేవీఆర్ పార్కు వద్ద మాత్రమే ఓపెన్ జిమ్ ఉంది. జేవీఆర్ డిగ్రీ మైదానం, దామోద చెరువు దగ్గర ఏర్పాటుకు నిర్ణయించినా కార్యరూపం దాల్చలేదు. మధిరలోని 22 వార్డులకు వైరానది ఒడ్డున, ఎస్సీ కాలనీ సమీపంలో మాత్రమే ఏర్పాటు చేశారు. ఇల్లెందులో 24 వార్డులకు రెండుచోట్ల ఏర్పాటుచేసినా వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన లేక నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇంకోటి నిర్మాణంలో ఉంది. మణుగూరు పట్టణంలో ఇప్పటివరకు ఒక్కటీ ఏర్పాటు చేయలేదు. నిర్మాణాలకు ఎలాంటి ప్రతిపాదనలు చేయకపోవటం గమనార్హం. నిధులు, స్థల కొరతతో ప్రణాళికలు చేయలేదని అంటున్నారు. పాల్వంచ పట్టణంలో 24 వార్డులు ఉన్నాయి. కేవలం ఒక్కచోట మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. అంత పెద్ద పట్టణానికి అది చాలదు. ఖమ్మం కార్పొరేషన్, కొత్తగూడెం వంటిచోట్ల మాత్రమే సింహభాగం ఓపెన్‌జిమ్‌లున్నాయి. ఆయాచోట్ల గతం నుంచి స్థలాలు ఉండటం, వెంచర్ల నుంచి తీసుకున్న స్థలాల లభ్యత సానుకూలంగా ఉంది. ఇతర పురపాలకాల్లో అలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు.

నిధుల సమస్యను అధిగమించొచ్చు

ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు నిధుల సమీకరణ ఇబ్బంది కాదనే వాదన ఉంది. రెండున్నరేళ్లుగా మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి నిధులు ఆశాజనకంగా ఉన్నాయి. వైరా, సత్తుపల్లి, మధిర, మణుగూరు, ఇల్లెందు వంటి పురపాలకాలకు ప్రతి నెలా రూ.30 లక్షల కంటే ఎక్కువ అందాయి. వ్యాయామానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో వీటి ఏర్పాటు వల్ల మహిళలు, యువత, వృద్ధులు.. అన్ని వర్గాల వారికి ఊరట కలగనుంది.

# కబ్జాదారుల కోరల్లో ఎనుమాముల



వరంగల్ : గతంలో వెనకబడిన ప్రాంతంగా ఉన్న ఎనుమాముల క్రమంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. గత ఏడాది లేబర్ కాలనీ నుంచి ఎనుమాముల వైపు వచ్చే వంద అడుగుల రహదారి విస్తరణ బాలాజీనగర్ కూడలి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో ఒక్కసారిగా వెనక బడిన ఎనుమాముల ప్రాంతం అభివృద్ధికి చేరువైంది. దీంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వంద అడుగుల ప్రధాన మార్గంలో గజానికి రూ.30 వేల వరకు ధర పలుకుతుండడంతో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది. దీంతో ఎనుమాముల ప్రాంతంలో ఆరుమాసాలుగా కబ్జాల పర్వం మొదలైంది. సాక్షాత్తు స్థానిక కార్పొరేటర్ భర్త తూర్పాటి సారయ్యనే పోలీసులు అదుపులోనికి తీసుకుని విచారణ చేపట్టడం పరిస్థితికి అద్దం పడుతోంది. కార్పొరేటర్ భర్త సోదరుడి కొడుకులు తూర్పాటి రఘు, శ్రీనివాస్, ఇద్దరు, జంగం రాజు, గంద్రాతి భాస్కర్ అనే ఇద్దరు భారాసా నాయకులు అరెస్టైన వారిలో ఉన్నారు. రాజకీయ అండతోనే కబ్జాలకు తెరలేపడంతో బాధితులు ఆరుమాసాలుగా అష్టకష్టాలు పడ్డారు. చివరికి వరంగల్ సీపీ రంగనాథ్ రూపంలో బాధితులకు అండ లభించింది. భూకబ్జా విషయంలో పోలీసులు విచారణ చేపట్టారు. సీపీ రంగనాథ్ ఆదేశానుసారం ఎస్ఐ శ్రీకాంత్, ఇద్దరు కానిస్టేబుళ్లు పోలీసు సిబ్బంది ఎనుమాములకు చేరుకుని ప్లాట్ల యజమానులతో మాట్లాడారు. గత రెండురోజులుగా రికార్డులు పరిశీలించిన విషయాలను క్రోడీకరించి స్థలం ఎవరిది, ఎవరు కబ్జా చేశారనే కోణంలో వివరాలు సేకరించారు. అనంతరం గత నెలలో ఓ ప్లాటులో పాతిన బోర్డును పోలీసుల సమక్షంలోనే బాధితులు తొలగించారు.

మాజీ కార్పొరేటర్ కనుసన్నల్లో..వరంగల్ ఎనుమాముల, కాశీబుగ్గ పరిసర ప్రాంతాలలో అధికార పార్టీకి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ రియల్టర్, అవతారమెత్తిన ఓ అడ్తి వ్యాపారి, మరో ముగ్గురు కలసి ఎనుమాముల శుభం గార్డెన్స్ సమీపంలో ఏకంగా రహదారినే కబ్జా చేశారు. అడిగిన స్థానిక కాలనీ వాసులను బెదిరించారు. ఈ విషయమై ఎనుమాముల వాసులు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను కలసి విన్నవించుకున్నా అక్రమణలు తొలగలేదని స్థానికులు వాపోతున్నారు. కోటిలింగాల దేవాలయం సమీపంలో మరో రియల్టర్, కాశీబుగ్గకు చెందిన ఓ బిర్యాని సెంటర్ యజమాని కలిసి రోడ్డుపైనే నిర్మాణం చేపట్టారు. ఇదేమిటని అడిగితే ఎక్కడ దాడి చేస్తారోనని జనం భయపడుతున్నారు.

# యువికా.. సృజన వేదిక

వరంగల్ : అంతరిక్షం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలోనూ ఉంటుంది.. విద్యార్థి దశ నుంచే ప్రత్యేక శిక్షణ ఇచ్చి.. వారి ఆలోచనలకు మెరుగులుదిద్దితే.. భావి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారు. ఈ విషయాన్ని గుర్తించిన ఇస్రో(అంతరిక్ష పరిశోధనా సంస్థ) ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అబ్దుల్ కలాం స్ఫూర్తితో యువ విజ్ఞాన్ కార్యక్రమం(యువికా) రూపొందించింది. అంతరిక్ష కేంద్రంలో జరిగే ప్రయోగాలు, పరిశోధనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏప్రిల్ 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

కార్యక్రమం ఇలా.. : ఎంపికైన విద్యార్థులకు శిక్షణ కాలంలో బస, భోజనంతో పాటు రవాణా ఛార్జీలు అందజేస్తారు. మే 15 నుంచి 26వ తేదీ వరకు శిక్షణ ఉంటుంది. ఎంపికైన విద్యార్థులతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరు అంతరిక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఇస్రోకు చెందిన అహ్మదాబాద్, బెంగళూరు, షిల్లాంగ్, తిరువనంతపురం, శ్రీహరికోట, హైదరాబాద్ కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ప్రముఖ శాస్త్రవేత్తలతో ముఖాముఖి, చర్చా వేదికలు, ప్రయోగాల సందర్శన, సమావేశాల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. అంతరిక్ష శాస్త్రం, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు.

నాలుగు దశల్లో : ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు విధానం నాలుగు దశల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. %www.isro.gov.in% వెబ్‌సైట్‌లో యువికా అప్లికేషన్ ఎంచుకుని, ఈ-మెయిల్ ఐడీతో లాగిన్ అవ్వాలి. నమోదు చేసిన 48 గంటల్లో ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. తర్వాత విద్యార్థి పూర్తి వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది. 8వ తరగతిలో 60 శాతం మార్కుల ప్రతిభ చూపి ఉండాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు 15 శాతం ప్రతిభ చూపాలి. జిల్లా స్థాయి వ్యాసరచన, ఉపన్యాస, క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తులను పరిశీలించి ఏప్రిల్ 20న అర్హుల జాబితా ప్రకటిస్తారు. ఎన్‌సీసీ, స్కౌట్‌లో సభ్యత్వం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని భూపాలపల్లి జిల్లా సైన్స్ అధికారి బి.స్వామి తెలిపారు.

# ఎట్టకేలకు ఊతం!

ఖమ్మం : ఎట్టకేలకు ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు గతేడాది భత్యం విడుదలైంది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, శారీరక వైకల్యం, మానసిక వైకల్యం, ఆటిజమ్, బహుళ వైకల్యం, మానసిక లోపం తదితర 21 రకాల రుగ్మతలు కలిగిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 1730 మంది ఉన్నారు. వీరికి గతేడాది (2021-22) రావాల్సిన అలవెన్స్‌లు మంజూరయ్యాయి. ఈ విద్యా సంవత్సరం (2022-23) భత్యాలు విడుదల కావాల్సి ఉంది.

ఎవరెవరికి ఏ భత్యం?

భవిత కేంద్రాలకు వెళ్లే ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రతి నెలా రవాణా భత్యం, పాఠశాలకు వెళ్లే పిల్లలకు (సహాయకులతో కలిసి) ఎస్కార్ట్ అలవెన్స్ ఇస్తారు. ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున ప్రతినెలా అందించాల్సి ఉంది. వీటితోపాటు బాలికలకు ఉపకార వేతనం కింద నెలకు మరో రూ.200, అంధత్వం సమస్య ఉన్న పిల్లలకు రీడర్ అలవెన్స్ కింద నెలకు రూ.60 చొప్పున అందిస్తారు.

రూ.10.80 లక్షలు విడుదల

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఎస్కార్ట్, ట్రావెల్ అలవెన్స్‌లు గతేడాది (2021-22)కి సంబంధించిన రూ.10.80 లక్షలను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి.

మరో రూ.20.70 లక్షల కోసం..

గతేడాది సాయం లభించినా 2022-23 సంవత్సరానికి సంబంధించిన అలవెన్స్‌లు ఇంకా రాలేదు. అధికారులు దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు. ఈ ఏడాది 554 మందికి మొత్తం రూ.20,70,900 రావాల్సి ఉంది. కొద్ది రోజుల్లో ఇవికూడా విడుదలవుతాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే బ్యాంకు ఖాతాలు తేడా ఉన్న 30మందివి గుర్తించి ఉన్నతాధికారులకు పంపించారు. "ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించిన అలవెన్సులు (2021-22) లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఈ విద్యా సంవత్సరానివి రెండు, మూడు రోజుల్లో మంజూరు కానున్నాయి."

సైదులు, సమ్మిళిత విద్యా జిల్లా సమన్వయకర్త

# మరోసారి సత్తా చాటిన మరియపురం

వరంగల్ : గీసుకొండ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామమైన మరియపురం మరోసారి తన సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులకు ఎంపికైంది. గతేడాది ఈ గ్రామం జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా ఎంపికవగా ఈ ఏడాది రాష్ట్రంలో ఉత్తమ గ్రామంగా ఎంపికవడం గమనార్హం. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ స్టేట్ వికాస్ పురస్కార్, నేషనల్ పంచాయతీ అవార్డులను 2021-22 సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 9 అంశాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకుగాను రాష్ట్రంలో మొత్తం 27 గ్రామపంచాయతీలను ఉత్తమ గ్రామాలుగా ఎంపిక చేసి ప్రకటించింది. జిల్లాలో అన్ని అంశాలకు పోటీ పడి మరియపురం తొమ్మిది అంశాల్లో నూరుశాతం ఫలితాలను సాధించగా, రాష్ట్ర స్థాయిలో ఆరోగ్యకరమైన



పంచాయతీ అనే అంశంపై ప్రథమ స్థానానికి ఎంపికైంది. కాలుష్యరహిత గ్రామంగా కార్బన్ నేచురల్ విశేష్ పంచాయతీ పురస్కారం (సీఎన్‌వీపీపీ) కింద మరో ప్రత్యేక అవార్డుకు ఎంపిక చేశారు. గ్రామంలో సోలార్ దీపాల ఏర్పాటు, పెంచడంలో ముందంజలో నిలిచింది.

జాతీయ స్థాయిలోనూ అవార్డు వస్తుంది

– అల్లం బాలిరెడ్డి, మరియపురం సర్పంచి

రాష్ట్రస్థాయిలో మా గ్రామానికి రెండు అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రజలు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు తనకు పూర్తి స్థాయిలో సహకరించడంవల్లే ఇది సాధ్యమైంది. తన పదవీకాలం పూర్తయ్యేలోగా గ్రామం మొత్తం సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసి ఎవరికి కావాల్సిన విద్యుత్తును వారే సొంతంగా తయారు చేసుకునేలా కృషి చేస్తా. మరోసారి జాతీయ స్థాయిలో అవార్డు వస్తుందని అనుకుంటున్నా.

# బస్తీ పిల్లలకు స్వర్గధామాలు

వరంగల్ : పేదల బస్తీలంటే ఎటు చూసినా గుడిసెలు, మురికి కాలువలు కనిపిస్తాయి. ఇక్కడి వారికి మంచి ఆటస్థలాలు కూడా అందుబాటులో ఉండవు. అలాంటిది ఆహ్లాదకరమైన ఆటమైదానాలను వారి కోసం సిద్ధం చేస్తోంది వరంగల్ మహానగరపాలక సంస్థ. వరంగల్, హనుమకొండల్లో ఇప్పటికే మురికివాడల పిల్లల కోసం అయిదారు పార్కులు సిద్ధమయ్యాయి. ఉదయం, సాయంత్రం, సెలవు దినాల్లో పిల్లలు ఇందులో ఆడుకుంటున్నారు. వారికి ఈ పార్కులు స్వర్గధామంలా ఉన్నాయి. గతేడాది కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ దేశవ్యాప్తంగా వంద ఆకర్షణీయ నగరాల్లో 'నర్చరింగ్ నైబర్‌హుడ్ ఛాలెంజ్' కింద ఒక పోటీ పెట్టింది. తల్లులు, పిల్లలకు (మాతాశిశు) ఆహ్లాదం పంచేలా ఆయా నగరాల్లో పార్కులు, ఆటస్థలాల అభివృద్ధి చేయాలన్నది దీని లక్ష్యం. ఈ క్రమంలో వరంగల్ ఎంహెచ్ నగర్, కాశీబుగ్గ క్రిస్టియన్ కాలనీల్లోని చెత్తాచెదారంతో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసుకొని పిల్లలు ఆడుకునేలా ఉద్యానవనంగా మార్చారు. దీనికి 'చిట్టి పార్కు'లుగా నామకరణం చేశారు. వరంగల్ మహానగరపాలక సంస్థ 44, 72 గంటల్లో వీటి నిర్మాణం శరవేగంగా పూర్తి చేసింది. దేశవ్యాప్తంగా పది నగరాలు ఈ పోటీలో విజేతలుగా నిలిస్తే అందులో వరంగల్ ఒకటి.

పిల్లలను ఆకట్టుకునేలా..

గ్రేటర్ వరంగల్ అధికారులు నగరంలోని మరికొన్ని మురికివాడలు, ఇతర ప్రాంతాల్లో పిల్లలకు ఆట స్థలాలను ఏర్పాటు చేస్తున్నారు. వరంగల్ మైసయ్య నగర్‌లో చిన్నారుల కోసం మైక్రో పార్కును నిర్మించారు. గుండుబావిలో సైతం పిల్లల కోసం మరొకటి తీర్చిదిద్దారు. వీటి గోడలపై రంగురంగుల అక్షరాలు, బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. పిల్లలు ఆడుకునే సరదా రైడ్లు, చిన్న వ్యాయామాలు చేసి పరికరాలను ఏర్పాటుచేశారు. వీటితోపాటు, హనుమకొండ శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటుచేసిన పార్కులో పిల్లలు కాసేపు ఆడుకున్నాక అక్కడే చదువుకునే వసతులు కల్పించారు. రాజీవ్‌నగర్ పార్కులో రాత్రి పది గంటల వరకు పరిసరాల్లోని చిన్నారులు స్వేచ్ఛగా ఆడేందుకు హైమాస్ట్ లైట్లను ఏర్పాటుచేసి, ఆట వస్తువులు అందుబాటులో పెట్టింది బల్దియా. ఉదయం వేళ బడికి వెళ్లే తొందరలో పార్కుకు వచ్చే వీల్లేకపోయినా, సాయంత్రం నుంచి రాత్రి వరకు స్వేచ్ఛగా ఆడుకునేందుకు చిన్నారుల కోసం నైట్ పార్కులను కూడా సిద్ధం చేస్తున్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ పథకం కింద ఉన్నందున హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌ను సైతం స్మార్ట్‌సిటీ నిధులతో తీర్చిదిద్ది రాత్రివేళ చిన్నారులు స్వేచ్ఛగా గడిపే వసతులు కల్పించారు.

# అధికారుల తప్పిదం.. అన్నదాతకు శాపం

గంగాధర : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణ మాఫీ అధికారులు, బ్యాంకర్ల నిర్లక్ష్యంతో పలువురు రైతులకు శాపంగా మారింది. 2018 డిసెంబరు 12లోపు పంట రుణం తీసుకున్న వారందరికీ రూ.లక్ష రుణమాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించగా క్షేత్రస్థాయిలో అలా జరగకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సెప్టెంబరు నెలాఖరులో అర్హులందరికీ మాఫీ వర్తిస్తుందని చెప్పినా ఇప్పటికీ 50 వేల మందికి కేవలం రూ.264.92 కోట్ల రుణ మాఫీ మాత్రమే వర్తించింది. ఇంకా 53 వేల మంది రైతులకు పైగా రుణమాఫీ జరగాల్సి ఉంది. కారణం నిధుల కొరత, పంట రుణానికి ఆధార్, చరవాణి అనుసంధానంలో తప్పిదం, పలు సాంకేతిక కారణాలతో రుణమాఫీ జాప్యం అవుతోంది. జిల్లాలో పలువురు రైతులు రుణమాఫీకి ఎదురవుతున్న ఇబ్బందులపై పరిశీలనా కథనం.3413 మంది రైతులకు ఇతరుల ఆధార్ అనుసంధానం

వాస్తవానికి బ్యాంకులో ఎవరైతే పంట రుణం పొంది ఉంటారో వారి ఆధార్, చరవాణి అనుసంధానం చేయాలి. కానీ జిల్లాలోని పలు బ్యాంకుల సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యంతో 3413 మంది రైతులకు ఇతరుల ఆధార్ నంబర్ లింక్ చేశారు. వేర్వేరు బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన రైతు వివరాల నమోదు సమయంలో అక్షర దోషంతో ఆధార్ అనుసంధానించే సమయంలో రెండో ఆధార్ ఉన్నట్లు వెల్లడైంది. సంబంధిత వ్యక్తి, ఆధార్ ఒకటే అయినా రెండోది ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదైంది. అర్హులైనా వీరికి సకాలంలో రుణమాఫీ జరగకపోవడంతో రైతులు బ్యాంకులు, ఏఈవోల చుట్టూ తిరుగుతున్నారు.

పంట రుణం ఖాతాకు 424 మంది రైతుల ఆధార్‌తోపాటు చరవాణి నంబర్ అనుసంధానించలేదు. వారికి రుణమాఫీ వర్తించడంలో ఇబ్బందులు తలెత్తాయి.

కుటుంబంలోని సభ్యుల వివరాలు నమోదు చేయకుండా ఒకరివే నమోదు చేసిన కేసులు 529 ఉన్నాయి.

బంగారు ఆభరణాలు కుదువపెట్టి పట్టాదారు పుస్తకాలపై అప్పు తీసుకున్నవారు 7411 మంది ఉన్నారు.

5775 మంది రైతులకు రూ.47 కోట్లు జమ చేసేందుకు ట్రెజరీల్లో బిల్లులు జమ చేశారు.

28,924 మందికి రూ.1.30 లక్షల రుణం పొందిన వారికి రుణమాఫీకి త్వరలోనే జమకానుంది. గ్రీవెన్స్‌సెల్‌కు జిల్లాలోని 380 మంది రైతులు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో ఖాతా మూతపడడం, ఒకే ఆధార్ ఇద్దరికీ జత చేయడం, రుణాన్ని రెన్యువల్ చేసుకోకపోవడం, ఖాతాలు కొనసాగించకపోవడంతో ఇబ్బందిగా మారింది. విచిత్రమేమిటంటే రైతు బతికి ఉంటే చనిపోయాక రుణం తీసుకున్నట్లు 40 ఘటనలు ఉన్నాయి. కానీ సంబంధిత రైతులు బతికి ఉన్నారు. వీటన్నింటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారుల ద్వారా తెలిసింది.

జిల్లాలో 1,03,748 మంది రైతులు రూ.847.85 కోట్ల రుణం పొంది ఉన్నారు.

ఈ చిత్రంలోని రైతు పేరు గంగాధర రాజన్న. 2018 కంటే ముందు గంగాధరలోని ఎస్బీఐలో రూ.35 వేల పంటరుణం తీసుకున్నారు. ఈయన పంటరుణ ఖాతాకు ఇదే గ్రామానికి చెందిన గంగాధర కాంతమ్మ ఆధార్, చరవాణి అనుసంధానించారు. ఇంటి పేరు కూడా జారతికి బదులు రారతిగా నమోదు చేశారు. రుణ మాఫీ జరగకపోవడంతో సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా తప్పిదం జరిగినట్లు వెల్లడైంది. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులు, బ్యాంకు సిబ్బంది వద్ద సమాధానం లేకుండా పోయిందని రైతు రాజన్న వాపోయారు.

తప్పులు సవరించి అర్హులకు వర్తింపజేస్తాం జిల్లాలోని అర్హులైన రైతులకు ఏమైనా తప్పిదం జరిగి ఉంటే సవరించి రుణమాఫీ వర్తింపజేస్తాం. ఇప్పటికీ రూ.1.30 లక్షల అవుట్‌స్టాండింగ్ ఉన్నవారికి మాఫీ వర్తిస్తుంది. రుణమాఫీకి కాలపరిమితి అంటూ ఏమి లేదు. పలుచోట్ల బ్యాంకర్లు వివరాల నమోదులో చేసిన తప్పిదంతో కొందరు రైతులకు వర్తించడం లేదు. వీరికి కూడా రుణమాఫీ వర్తింప జేస్తాం. తప్పులు సవరించి న్యాయం చేసేందుకు గ్రీవెన్స్‌సెల్ కూడా ఏర్పాటు చేశాం. అర్హులైన వారికి మాఫీ వర్తించకపోతే ప్రతి కేసును పరిశీలించి రుణ మాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటాం.వాసిరెడ్డి శ్రీధర్, డీఏవో

# పసుపు బోర్డుతో ప్రయోజనం

జగిత్యాల : నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. తెలంగాణలో నిజామాబాద్ తర్వాత జగిత్యాల జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో పసుపు పంటను సాగుచేస్తుండగా బోర్డు ఏర్పాటుతో స్థానిక రైతులకు ప్రయోజనం కలగనుంది. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు, క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధర డిమాండ్‌తో 2019 పార్లమెంటు ఎన్నికల్లో దేశంలోనే అత్యధికంగా నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి 176 మంది పసుపు రైతులు పోటీపడి తమ అభిమతాన్ని బలంగా చాటారు. తదుపరి బోర్డు ఏర్పాటుకు నేతలు ప్రయత్నించినా సాధ్యంగాక నిజామాబాద్‌లో సుగంధద్రవ్యాల ప్రాంతీయ కార్యాలయాన్ని రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. నిజామాబాద్‌ను పసుపుహబ్‌గా ప్రకటించారు. అయినప్పటికీ సుగంధద్రవ్యాల బోర్డు ప్రాంతీయ కార్యాలయం, హబ్‌ద్వారా తగిన క్షేత్రస్థాయి చర్యలు లేనందున తమకు అదనపు ప్రయోజనం కలగలేదని రైతులు పేర్కొంటున్నారు.

పసుపుబోర్డు ఏర్పాటుతో పంటపై స్థానికంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టి పరిస్థితులకు అనువైన వంగడాలను ఉత్పత్తి చేస్తారు. అత్యధిక కర్క్యుమిన్(పసుపు)శాతం కలిగిన రకాలు ఉత్పత్తిచేస్తే మార్కెట్లో అధిక ధర దక్కుతుంది. చీడపీడలను తట్టుకొనే వంగడాలు అందుబాటులోకి వస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. రైతులకు యంత్రపరికరాలు రాయితీపై అందుతాయి, రుణాలు, శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి సలహాలు దరిచేరతాయి. పసుపును నిల్వచేసే శీతల గిడ్డంగులను నిర్మిస్తారు. పసుపు పాలిషింగ్, ఉపఉత్పత్తుల తయారీ కేంద్రాలు వెలుస్తాయి. గతంలో పసుపు ఎగుమతులను కేంద్రం పర్యవేక్షించగా నిజామాబాద్‌లో బోర్డు ఏర్పడితే నేరుగా ఇక్కడి నుంచే విదేశాలకు ఎగుమతి సాధ్యపడుతుంది. దేశంలో మహారాష్ట్రలోని సాంఘ్లీ, తమిళనాడులోని ఈరోడ్ తదుపరి నిజామాబాద్ మార్కెట్లోనే అత్యధికంగా పసుపు క్రయవిక్రయాలు సాగుతుండగా జగిత్యాల జిల్లా రైతులూ నిజామాబాద్‌కు తమ పంటను తీసుకెళ్లి విక్రయిస్తారు. నిజామాబాద్‌లో బోర్డు సేవలతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నేరుగా నిజామాబాద్ నుంచే ఉత్పత్తులను తీసుకునే వీలు కలిగి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన మెలకువలతో నాణ్యమైన ఉత్పత్తులు చేతికివచ్చి అధిక ధరలు లభిస్తాయి.

కర్షకులకు కలిసివచ్చే అంశాలుజిల్లాలో సరాసరిగా 7.9 లక్షల క్వింటాళ్ల పసుపు దిగుబడి ఉండగా పాలిషింగ్, రంగులు, మందుల తయారీ కంపెనీలను రాయితీపై ఇస్తే యువతకు ఉపాధి దొరుకుతుంది. స్థానిక పరిశ్రమలతో ధరల్లో స్థిరత్వం ఉంటుంది.ఇ-నామ్ వ్యవస్థను దేశంలోని అన్ని రాష్ట్రాల మార్కెట్లతో అనుసంధానించాలి. దేశవ్యాప్త వ్యాపారులు పోటీపడితే స్థానిక యార్డుల్లోనూ ధరలు పెరుగుతాయి. క్వింటా ఎండుకొమ్ముల ధర కనీసం రూ.12 వేలకుపైగా ఉండేలా పసుపుబోర్డు, కేంద్ర వాణిజ్యశాఖ, ఉద్యానశాఖలు చర్యలు చేపట్టాలి. నిల్వలు, దిగుబడి అంచనావేసి ఎగుమతికి అవకాశమిస్తే ధరలు పెరుగుతాయి. ఉమ్మడి జిల్లాలోని పసుపు పరిశోధనలను నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి తరలించగా జగిత్యాలలో ఉద్యాన పరిశోధనస్థానం ఏర్పాటుచేస్తామన్న హామీని నెరవేర్చాలి.నిజామాబాద్ జిల్లా పడిగెల్ వద్ద స్పైసెస్‌పార్కును అందుబాటులోకి తెస్తే ఈ పార్కులో పసుపును పాలిషింగ్‌చేసి ఉపఉత్పత్తులు, రంగులు, ఔషధాలు తయారుచేసే పరిశ్రమలను ఏర్పాటు చేస్తారు

# ఆగని అక్రమం..!




మహబూబాబాద్ : ఈ లారీ బెరైటీస్‌ను అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడింది. ఈ ఏడాది జూన్ 9న పాత పోచారం నుంచి కమలాపురం వెళ్లే దారిలో తెల్లవారుజామున పోలీసులు వాహనాన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించి బాధ్యులపై కేసు నమోదు చేశారు. సుమారు 20 రోజుల కిందట వాహనాన్ని పంపించారు. ఖనిజాన్ని సూర్యాపేట జిల్లా కోదాడ వైపు తరలించాలనుకున్నట్లు లారీ డ్రైవర్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు.గార్ల మండలం పోచారం, బాలాజీతండా పంచాయతీ పరిధిలో దాదాపు 100 ఎకరాల్లో బెరైటీస్ విస్తరించింది. కొంత కాలం సర్కారు అనుమతులతో తవ్వకాలు జరిగాయి. పలు కారణాలతో బెరైటీస్ తవ్వకాలు కొన్నాళ్లుగా ఆగాయి. నిక్షేపాలున్న గుట్టు చుట్టూ కందకాలు తీసినా అక్రమ తరలింపు ఆగడం లేదు. గుట్ట ప్రాంతం తమదంటే తమదని రెవెన్యూ, అటవీశాఖ అధికారులు అనడంతో ఎటు తేలక సుమారు 12 ఏళ్ల కిందట మూతబడింది. ఆ ప్రాంతమంతా తమకు చెందినదేనంటూ అటవీశాఖ అధికారులు గుట్ట చుట్టూ కందకాలు తీశారు. ఖనిజం విలువ తెలిసిన కొంత మంది అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా తరలింపుపై దృష్టి సారించారు. చీకటిపడితే చాలు.. టిప్పర్లు, ట్రాక్టర్లతో గుట్ట ప్రాంతంలోని కందకాల వద్దకు వెళ్లి కూలీల సహాయంతో రాళ్లను వాహనాల్లో లోడ్ చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా చేరాల్సిన చోటికి చేర్చుతూ లాభాలు ఆర్జిస్తున్నారు. అక్రమాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం 'మాములు'గా తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా రాత్రి సమయంలో కట్టుదిట్టమైన భద్రతను పెంచి విలువైన ఖనిజం తరలకుండా చూడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కొంత కాలంగా ..

ఈ ఖనిజాన్ని పెట్రోల్ శుద్ధి చేసేందుకు, రంగుల తయారీకి, తదితర వాటికి వినియోగిస్తారు. ఆ మైనింగ్ ప్రాంతాన్ని మూసేసే సమయంలో గుట్టపై అక్కడక్కడ తవ్వి వదిలేసిన ఖనిజ రాళ్లకుప్పలున్నాయి. అది తెలిసిన అక్రమార్కులు వాటిని తరలిస్తున్నారు. సుమారు మూడేళ్ల కిందట ఖనిజాన్ని ఆ ప్రాంతంలోని ఓ వ్యక్తి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తుండగా అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. వారిపై చర్యలు తీసుకున్నా అక్రమం అగడం లేదు. రాత్రి పూటనే కాకుండా సెలవు దినాల్లో అయితే సమయం సందర్భం అనేది లేకుండానే పొరుగు రాష్ట్రంలోని కాకినాడకు తరలించి అక్కడి నుంచి చేర్చాల్సిన చోటికి చేర్చుతున్నారు. ఒక్కో టిప్పరు ఖనిజాన్ని సుమారు రూ.7 లక్షలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

పరిశ్రమ పునరుద్ధరిస్తే

పరిశ్రమ మూతపడడానికి కారణాలను త్వరగా పరిష్కారం చూపడంలో పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి. పరిశ్రమను పునఃప్రారంభించి పూర్వవైభవం తీసుకురావాలి. దాంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆ ప్రాంతంలోని చాలా మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని గార్ల మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ రాళ్ల కుప్ప అంతా బెరైటీస్ ఖనిజం. గత నెల 19న రాత్రి సమయంలో ఆ ఖనిజాన్ని అక్రమార్కులు ట్రాక్టర్‌లో తరలించేందుకు ప్రయత్నించారు. ఆ ప్రాంతం బురదగా ఉండడంతో వాహనం అందులో కూరుకపోయింది. తెల్లవారితే దొరికిపోతామనే భయంతో అక్రమార్కులు గత్యంతరం లేక ఆ విలువైన రాళ్లను కిందపడబోసి వాహనంతో ఉడాయించారు. అందుకు కారకులు ఎవరనే అంశంపై అటవీశాఖ అధికారులు విచారణ చేస్తున్నారు.నిఘా పటిష్ఠం చేశాం – రమేశ్, డీఆర్వోఖనిజ నిక్షేపం ఉన్న ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటు విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం పరిసర గ్రామ వద్ద నిఘాను పటిష్ఠం చేశాం. నిబంధనలు విస్మరించి తరలింపునకు పాల్పడితే కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటాం.

# బిల్టు కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరం



జయశంకర్ : బిల్ట్ కర్మాగారం తిరిగి తెరచుకుంటుందని తొమ్మిదేళ్లుగా ఎదురుచూశారు కార్మికులు. ఎన్సీఎల్టీ( నేషనల్ కంపెనీస్ లా ట్రిబ్యునల్) తీర్పుతో వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం బిల్ట్ పరిశ్రమ మరో సంస్థ ఆధీనంలోకి వెళ్లింది. ట్రిబ్యునల్‌లో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, రావాల్సిన ప్రయోజనాల్లో కనీసం పది శాతం కూడా క్లెయిమ్ కాలేదని, తమ భవిష్యత్తు ఏంటనీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రైబ్యునల్ తీర్పుతో అన్యాయం

జిల్లాలోని మంగపేట మండలం కమలాపూర్‌లోని బిల్టు కర్మాగారంలో యాజమాన్యం 2014 ఏప్రిల్ 3న ఉత్పత్తి నిలిపివేసింది. తొమ్మిదేళ్ల పాటు కార్మికులు పునరుద్ధరణకు పోరాటాలు చేశారు. ప్రభుత్వాలకు మొర పెట్టుకున్నా.. ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. అప్పులు పెరిగిపోవడంతో బ్యాంకులు, ఇన్వెస్టర్లు కలిసి నేషనల్ కంపెనీస్ లా ట్రైబ్యునల్(ఎన్సీఎల్టీ)కు 2020లో వెళ్లారు. ఇన్‌సాల్వెన్సీ రీసాల్వెన్సీ ప్రాసెస్(ఐఆర్పీ) ఏర్పాటు చేశారు. వివిధ బ్యాంకులు అప్పుల వివరాలను సమర్పించాయి. కార్మికులు కూడా వారికి రావల్సిన రూ.87 కోట్లకు పైగా వేతనాలు, ఇతర బెనిఫిట్స్ వివరాలను కూడా అందజేశారు. సుమారు 38 నెలల తర్వాత ఏప్రిల్‌లో ఎన్సీఎల్టీ తుది తీర్పు వెల్లడించింది. ఇందులో కార్మికులకు కేవలం రూ.7.84 కోట్లు మాత్రమే చెల్లించాలని సూచించింది. ఇటీవల కార్మికులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది దాదాపు మొత్తం 780 మందికి ఆయా సీనియారిటీ ప్రకారం వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. ఒక్కొక్కరికి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రావాల్సి ఉన్నా.. రూ.80 వేల నుంచి లక్షన్నర లోపు మాత్రమే వచ్చిందని కార్మికులు వాపోయారు. మధ్యవర్తిత్వం చేసిన ఐఆర్పీ మాత్రం రూ.84 కోట్లు తీసుకున్నట్లు తెలిసింది. కార్మికులు న్యాయం కోరుతూ.. గ్రాట్యూటీ, ఇతర బకాయి ప్రయోజనాలు చెల్లించాలని ఎన్సీఎల్ఏటీ(నేషనల్ కంపెనీస్ లా అప్పిలేట్ ట్రైబ్యునల్)ను ఆశ్రయించారు.

ఫిన్‌క్విస్ట్ చేతికి..

బిల్ట్ గ్రూపులోని యమునానగర్, ఒడిశా చౌద్వార్, కమలాపూర్(బిల్ట్).. ఈ మూడు ఖాయిలా పడ్డ కంపెనీలను రూ.740 కోట్లకు ఫిన్‌క్విస్ట్ సంస్థ దక్కించుకుంది. ఇటీవలే ఈ సంస్థ బిల్ట్‌ను ఆధీనంలోకి తీసుకుంది. అందులోని సామగ్రి పనికిరాకుండా ఉందని, పూర్తిగా నిర్మాణాలను తొలగించనున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కర్మాగారం స్థలాన్ని లెక్కగట్టేందుకు సర్వేలు చేస్తున్నారు.

కంపెనీల ఆసక్తి..ఫిన్‌క్విస్ట్ సంస్థ కోల్‌కతా కేంద్రంగా పనిచేస్తుంది. దీనిని మరో కంపెనీకి అప్పగించేందుకు చూస్తున్నట్లు కార్మికవర్గాలు చెబుతున్నాయి. ఐటీసీ, వెస్ట్‌కోస్ట్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో బిల్ట్ కంపెనీని టేక్‌ఓవర్ చేసుకోవాలని ప్రభుత్వం ఐటీసీని కోరిన సందర్భాలున్నాయి. భద్రాచలంలో కూడా ఐటీసీ కంపెనీ ఉంది. ఎవరి చేతుల్లోకి వెళ్తుందో చూడాలి.

సర్వీసు ఉన్న వారిని తీసుకోవాలి– రాంచందర్, బిల్టు ఐకాస నాయకుడు కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కంపెనీ వేరే చేతుల్లోకి వెళ్లింది. గతంలో ప్రభుత్వం రూ. 327 కోట్లు బిల్టు యాజమాన్యానికి రాయితీలను ప్రకటించింది. భవిష్యత్తులో తీసుకునే కంపెనీ కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించేలా చూడాలి. సర్వీసు ఉన్నవారిని విధుల్లోకి తీసుకోవాలి. ఆర్థికంగా చితికిపోయాం..– కుర్బాన్ అలీ, బిల్టు ఐకాస నాయకుడు కంపెనీ మూతబడటంతో ఆర్థికంగా చితికిపోయాం. పదేళ్ల పాటు వేతనాలు లేక ఖాళీగా కూర్చున్నాం. ఎందరో కార్మికులు ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అనారోగ్యంతో మృతిచెందారు. తిరిగి తెరచుకుంటుందని ఆశ పడ్డాం. ట్రిబ్యునల్ తీర్పుతో అన్యాయం జరిగింది. ఏదైనా కంపెనీ తీసుకుని తిరిగి ప్రారంభిస్తే.. ముందు మాకే అవకాశం కల్పించాలి.

# కట్టను తెంచినా అడిగే దిక్కేది?

వరంగల్ : స్థిరాస్తి వ్యాపారులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ అధికారి వచ్చినా తమనేమీ చేయలేరన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. వరంగల్–హనుమకొండ నగరాల నడి బొడ్డున ఉన్న భద్రకాళి చెరువు కట్టను హంటర్‌రోడ్ పాత ఆర్టీసీ టైర్ కంపెనీ నుంచి హనుమకొండ పద్మాక్షిగుట్ట రోడ్డుకెళ్లే మార్గంలో తెంచేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కట్టను తవ్వేశారు. దీంతో న్యూశాయంపేట, పద్మాక్షి కాలనీ వైపు నుంచి మురుగంతా చెరువులోకి వెళ్తోంది. చెరువును ఆహ్లాదకరంగా మార్చడం కోసం గ్రేటర్ అధికారులు హృదయ్, స్మార్ట్‌సిటీ పథకాల ద్వారా సుమారు రూ.92.50 కోట్లతో భద్రకాళి బండ్ అభివృద్ధి పనులు చేపట్టారు. ఇటీవల జిల్లా పర్యాటక శాఖ బోటింగ్ కూడా ప్రారంభించింది. ఒకవైపు అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులు జరుగుతుంటే మరోవైపు కొందరు ప్రైవేటు వ్యక్తులు చెరువును చెర బడుతున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదు. దీంతో కొందరు స్థిరాస్తి వ్యాపారులు హంటర్‌రోడ్, నవయుగ కాలనీ, పెట్రోల్ పంపు వెనుక, గాయత్రి నగర్, సాయినగర్, బృందావన్ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీలో అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలు చేస్తున్నారు.భద్రకాళి చెరువును కాపాడాలని వరంగల్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఫసీ ఆదిబ్ ట్విటర్ ద్వారా మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఈ ఏడాది జులైలో కురిసిన భారీ వర్షాలతో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 200 కాలనీలు నీట మునిగాయి. భద్రకాళి చెరువు విస్తీర్ణం (క్యాచ్‌మెంటు) తగ్గడంతో వరద నీరు కాలనీలను ముంచెత్తాయని, తాజాగా హనుమకొండ పద్మాగుట్ట రోడ్ వైపు భద్రకాళి మినీ బండ్ ఏర్పాటుకు రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో నగర ప్రజల్లో భయాందోళన మొదలయిందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌కు ట్విటర్ ద్వారా విన్నవించారు. అవసరాల దృష్ట్యా భద్రకాళి చెరువును కాపాడాలని, కబ్జాలు, ఆక్రమణలు నిలువరించాలని కోరారు. భారత అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఫుల్ ట్యాంకు లెవల్ (ఎఫ్‌టీఎల్) నిబంధనలకు విరుద్ధంగా స్థలాల అమ్మకాలు, జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు.

# దీర్ఘకాలిక కల.. నెరవేరిన వేళ

ముస్తాబాద్ : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రామ పంచాయతీలకు ఎట్టకేలకు నూతన భవనాలు నిర్మించారు. పక్కా భవనాలు లేక గ్రామ పంచాయతీ పాలకవర్గం, సిబ్బందితో పాటు నిత్యం కార్యాలయానికి వచ్చే గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. మంత్రి కేటీఆర్ చొరవతో పక్కా భవనాలు నిర్మించారు. దీర్ఘకాలిక కల నెరవేరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటిని నేడు ప్రారంభించేందుకు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముస్తాబాద్ మండలంలో 22 గ్రామాలున్నాయి. పంచాయతీలకు పక్కా భవనాలు లేక ఏళ్ల తరబడి కుల సంఘాలు, సామాజిక సంఘ భవనాలు, శిథిలావస్థలోని పంచాయతీ కార్యాలయాలు, పాఠశాల తరగతి గదిలో అరకొర వసతుల మధ్య కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఎట్టకేలకు మంత్రి కేటీఆర్ చొరవతో భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. పక్కా భవనాలు పూర్తి చేసి ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. సర్పంచి గది, సమావేశ మందిరం, కంప్యూటర్ గది, మహిళలకు సమావేశ గదులను ఆధునిక హంగులతో నిర్మించారు. సేవాలాల్‌తండాలో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 16 లక్షలు, ఈజీఎస్, డీఎంఎఫ్‌టీ (జిల్లా మైనింగ్ ఫండ్) ద్వారా ఆవునూర్లో రూ.23 లక్షలు, తుర్కపల్లెలో రూ. 20 లక్షలు, మొర్రాపూర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించారు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన ప్రజలకు కొత్త కార్యాలయాలు అందుబాటులోకి రానుండటంతో స్థానికులకు, పంచాయతీ పాలకవర్గాలు, సిబ్బందికి కష్టాలు తీరనున్నాయి.

అందుబాటులోకి మరికొన్ని..

తుర్కపల్లెలో రూ. 10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, ఆవునూర్‌లో రూ. 33 లక్షలతో కట్టిన ప్రగతి ప్రాంగణం, తెర్లుమద్దిలో రూ. 20 లక్షలతో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానా, రూ. 33 లక్షలతో కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, రూ. 8 లక్షల వ్యయంతో నిర్మించిన సామాజిక భవనం, సేవాలాల్‌తండాలో రూ. 1.77 కోట్లతో నిర్మించిన వంతెనను నేడు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

పూర్తిస్థాయిలో సౌకర్యాలు

మంత్రి కేటీఆర్ చొరవతో మా గ్రామంలో ఈజీఎస్, డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా రూ.23 లక్షలతో నూతన పంచాయతీ భవన నిర్మాణం పూర్తయింది. రూ. 33 లక్షలతో ప్రగతి ప్రాంగణం నిర్మించుకున్నాం. మా పాలక వర్గం పదవీ కాలంలో నూతన భవనాలు నిర్మించుకొని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది.

బద్ది కల్యాణి, సర్పంచి, ఆవునూర్

సంతోషంగా ఉంది మా గ్రామంలో మంత్రి కేటీఆర్ చొరవతో ఈజీఎస్, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.20 లక్షల వరకు వెచ్చించి నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించాం. నూతన భవనం ప్రారంభించనుండటం సంతోషంగా ఉంది. గ్రామస్థులకు పంచాయతీ కార్యాలయాల్లో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

కాశోల్ల పద్మ, సర్పంచి తుర్కపల్లె

ఎనిమిది పూర్తి ముస్తాబాద్ మండలంలోని ఎనిమిది గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. నేడు ఆవునూర్, సేవాలాల్‌తండా, మొర్రాపూర్, తుర్కపల్లె గ్రామాల్లో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కార్యాలయాలు ప్రారంభిస్తాం. ఇక నుంచి పాలక వర్గానికి, ప్రజలకు నూతన భవనాలు అందుబాటులోకి రానున్నాయి. వీటితోపాటు సీసీరోడ్డు, కేసీఆర్ ప్రగతి ప్రాంగణాలను ప్రారంభించనున్నారు. ప్రజలకు అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి.

ఇనాయితుల్లా, పంచాయతీరాజ్ ఏఈ

# ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్టేద్దాం!

అచ్చంపేట : ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. ఉపయోగం లేకుండా పోతోంది. డిజిటల్ లావాదేవీలు పెరిగి పోవడంతో అదే స్థాయిలో మోసాలు కూడా అధికమవుతున్నాయి. పండుగ సందడి మొదలవడంతో ఆన్‌లైన్ కొనుగోళ్లు మరింత పెరిగాయి. కొన్ని ఉత్పత్తులపై 50 శాతం నుంచి 90 శాతం వరకు తగ్గింపు.. ఒకటి కొంటే మరొకటి ఉచితం.. ఛార్జీలు లేకుండా ఉచిత రవాణా అంటూ ప్రకటనలు ఊరిస్తున్నాయి. కొన్ని కంపెనీలు నిజమైన రాయితీలు ఇస్తుండగా మరికొన్ని బోగస్ ప్రకటనలతో బురిడీ కొట్టిస్తున్న సంఘటనలు ఎన్నో వెలుగు చూస్తున్నాయి. మాల్స్, షోరూముల్లో కనిపించని వస్తువులు ఆన్‌లైన్ షాపింగ్‌లో దర్శనమిస్తున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనలను గుడ్డిగా నమ్మితే మోసపోవడం మీవంతవుతుంది. ప్రచారంలో చెప్పిన వస్తువు ఆర్డర్ చేయగానే ఇంటికి వేరేది వస్తోంది. ధరల్లో కూడా వ్యత్యాసం ఉండటంతో ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందుల్లో పడుతున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు ఫర్నీచర్, రెడీమేడ్స్, మహిళల యాక్సరీస్, కాస్మోటిక్స్, స్మార్ట్‌ఫోన్లు తదితర రకాల ఉత్పత్తులు దర్శనమిస్తుంటాయి. ఆర్డర్ చేసిన కొద్ది రోజుల్లోనే ఆయా కంపెనీలు వాటిని నేరుగా ఇంటికే పంపిస్తున్నాయి. చూడటానికి, వినడానికి ఈ విధానం బాగున్నా కొన్ని సందర్భాల్లో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్డర్ చేసిన వస్తువులు రాగానే వాటిని చూసి విస్తుపోతున్న సంఘటనలు ఎన్నో వెలుగు చూస్తున్నాయి.

ఇంటి నుంచే ఫిర్యాదు.. ఆన్‌లైన్ మోసాల బారిన పడినవారు పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా ఇంటి నుంచే అంతర్జాలంలోనే ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది. నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఆసక్తి చూపని వారికి చక్కని అవకాశం ఉంది. ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం ఆన్‌లైన్ సైబర్ క్రైం ఫిర్యాదు పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్‌ను ఉపయోగించి బాధితులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడానికే పరిమితం కాకుండా దానికి సంబంధించిన దర్యాప్తు ఎంత వరకు వచ్చిందనే అంశాన్ని కూడా తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్ ఫిర్యాదు చేసేందుకు సీవైబీఈఆర్‌సీఆర్ఐఎంఈ.జీవోవీ.ఐఎన్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. ఘటనకు సంబంధించిన కీలక వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదు దారు సోషల్ మీడియా ఖాతా వివరాలు, వెబ్‌సైట్ యూఆర్ఎల్‌ను నమోదు చేసి ఆపై నేరానికి సంబంధించిన సాక్ష్యాలను అప్‌డేట్ చేయాలి. ఫిర్యాదు ప్రతిని పీడీఎఫ్ విధానంలో భద్రపరచుకోవచ్చు. దాన్ని ప్రింట్ కూడా తీసుకోవడానికి అవకాశం ఉంది.

ఓటీపీ నంబరు చెప్పడంతో..

అచ్చంపేటకు చెందిన ఒకరు వైద్య పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఉన్న సమయంలో అతనికి అపరిచితుడు ఫోన్‌చేశారు. కాల్ సెంటర్ నుంచి ఫోన్ చేస్తున్నామని చరవాణిని అప్‌డేట్ చేసుకోకపోతే సేవలు నిలిచిపోతాయని నమ్మించాడు. ఓటీపీ చెప్పాలని కోరడంతో ఆస్పత్రిలో ఉన్న ఆ వ్యక్తి హడావుడిలో ఆలోచన చేయకుండా చెప్పేశాడు. వెంటనే అతని బ్యాంకు ఖాతాలోని రూ. 99 వేలు మాయమయ్యాయి. సంక్షిప్త సమాచారం చూసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.


లాటరీ వచ్చిందని..

అచ్చంపేటలోని ఓ కాలనీకి చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓ కంపెనీ నిర్వహించిన లాటరీలో రూ. 25 లక్షలు బహుమతి వచ్చిందని నమ్మించాడు. బహుమతిని పొందడానికి వివిధ ఫీజుల కోసం రూ. 1.50 లక్షలు పంపింది. మరోసారి కొంత నగదు చెల్లించాలని ఫోన్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# మత్తులో చిత్తు..

కొత్తగూడెం : కొందరు యువత మత్తు కోసం కొత్త దారులు వెతుకుతున్నారు. ఈ క్రమంలో మైకం కలిగించే ఇతర పదార్థాలను వాడుతున్నారు. బాధితుల్లో ఎక్కువగా చదువు మానేసిన వారు, కొందరు విద్య కొనసాగించే వారూ ఉండటం ఆందోళన కలిగించే విషయం. వాహనాల ట్యూబులకు పంక్చర్లు వేసేందుకు వినియోగించే రసాయన మిశ్రమం(లోషన్)తో పాటు అక్షరాలు చెరిపేందుకు వాడే వైట్‌నర్‌ను మత్తు కోసం వినియోగిస్తున్న వైనం కొంతకాలంగా కనిపిస్తోంది. వైట్‌నర్ తయారీకి వినియోగించే మందు 'నార్కోటిక్స్' నిషేధిత జాబితా పరిధిలోకి వస్తుంది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో మత్తు కోసం ఎక్కువగా అడ్డదారులు తొక్కుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో యువకులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా మత్తు కోసం వెంపర్లాడుతున్నారు. నిర్జన ప్రదేశాల్లోకి చేరి చేతి రుమాలుపై రసాయనం చల్లి పీల్చుతున్నారు. లోషన్ ఆవిరి పీల్చి మైకంలో జోగుతున్నారు. చెడు స్నేహాల ద్వారా ఈ రొంపిలోకి దిగుతున్న వారే ఎక్కువని బాధిత కుటుంబాల ద్వారా తెలుస్తోంది. ఇదేమిటని మందలిస్తే తమ బిడ్డలు తిరగబడేందుకూ వెనుకాడటం లేదని కొందరు తల్లిదండ్రులు వాపోతున్నారు. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినా ప్రవర్తన మార్చుకోలేని స్థితికి చేరారు. యువతతో పాటు భిక్షాటన చేసేవారు, ఉపాధి వెతుక్కొంటూ ఇతర రాష్ట్రాల నుంచి వలసొచ్చిన వారు ఈ రొంపిలోకి దిగుతున్నారు. ఒక్కోసారి విచక్షణ కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకూ పాల్పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం స్వచ్ఛంద సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయించగా వైట్‌నర్ సీసాలు, పెన్నుల విక్రయాలను నియంత్రించారు. ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. పలు దుకాణాల్లో విరివిగా దొరుకుతున్నాయి.

దృష్టిసారిస్తే మేలు జిల్లా ఉన్నతాధికారులు 'మత్తు సమస్య'పై ఇప్పటికైనా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. కొన్నేళ్ల క్రితం డ్రగ్స్ కేసులో ప్రముఖుల పేర్లు వినిపించడంతో పోలీసు, ఆబ్కారీ శాఖలు రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తంగా వ్యవహరించాయి. పోలీస్ స్టేషన్ల పరిధిలో మత్తు వినియోగంపై హాట్‌స్పాట్లు గుర్తించారు. మూకుమ్మడిగా దాడులు చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి మత్తు వాడకంతో కలిగే అనర్థాలు వివరించారు. మరోసారి ఈ ప్రయత్నాలు తిరిగి ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు,



స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి.

వైద్యులేమంటున్నారంటే...

గతంలో రోగులకు మత్తు ఇచ్చేందుకు దీన్ని వాడేవారని, నూతన పరిశోధనల తర్వాత ఆరు దశాబ్దాలుగా పక్కనపెట్టినట్లు కొత్తగూడెంకు చెందిన ఓ ప్రభుత్వ వైద్య నిపుణుడు తెలిపారు. ఎవరైనా పీల్చితే మెదడుపై రెండు, మూడు గంటల వరకు మత్తు కలుగుతుంది. విరివిగా పీల్చేవారిలో గుండె వేగం పెరుగుతుంది. కాలేయం, శ్వాసకోశ వ్యవస్థ, మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదమూ ఉంది. పంక్చర్‌కు వేసే లోషన్‌ను నిప్పులపై వేసి ఆవిరి పీల్చినా ఇదే ప్రభావం కనిపిస్తుంది. కొందరు బానిసలుగా మారి వీటి వినియోగం నుంచి బయటపడలేక పోతున్నారు. మూడేళ్ల పాటు వైట్‌నర్ వాడితే ప్రాణాపాయం తప్పదని మత్తు వైద్యులు హెచ్చరిస్తున్నారు. క్యాన్సర్ కూడా ప్రబలుతుందన్నారు. కొందరు యువత, విద్యార్థులు సైతం మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నట్లు సమాచారం. గంజాయికి తోడు వైట్‌నర్ వంటి వాటితో మత్తును కోరుకుంటున్నారు. కొందరిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. తల్లిదండ్రులను పిలిపించి జాగ్రత్తలు సూచిస్తున్నాం. గతంలో జిల్లా కేంద్రంలో గుర్తించిన హాట్ స్పాట్సపై త్వరలో నిఘా మరింత పెంచుతాం. పిల్లల ప్రవర్తనలో వచ్చిన మార్పులను కన్నవాళ్లు పసిగట్టాలి. అర్ధరాత్రి వరకు బయట తిరిగిరావడాన్ని, చెడు స్నేహాలను నియంత్రించాలి. శాఖాపరంగా విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. అబ్దుల్ రెహ్మాన్, డీఎస్పీ, కొత్తగూడెం

# ఓరుగల్లుకు ఐటీ హారం

వరంగల్ : 'రూ. 80 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకు నిధులు వెచ్చించి ఐటీ టవర్స్‌ను నిర్మించాలని భావిస్తున్నారు. ఈ టవర్ నిర్మాణానికి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌తో శంకుస్థాపన చేయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. లేదంటే భూసేకరణ పూర్తయ్యాక భూమిపూజ ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ విస్తరణకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా హనుమకొండ నగరం నడిబొడ్డున భారీ ఐటీ టవర్‌ను నిర్మించి ఓరుగల్లుకు బహుళ జాతి కంపెనీలను తీసుకురావాలని నిర్ణయించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌కు ఎదురుగా ప్రభుత్వ స్థలం రెండెకరాలకు పైగా ఉంది. ప్రస్తుతం ఇక్కడ కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వీటిని మరోచోటికి మార్చి ఇక్కడే ఐటీ కంపెనీలకు సౌకర్యాలు కల్పిస్తే హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ తరహాలో నగరానికి ఇది మణిహారంలా ఉంటుందని ఇక్కడ టవర్స్ ఏర్పాటుకు నిర్ణయించారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) ఈ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించి భారీ టవర్‌ను నిర్మించనుంది. దీని కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించనున్నారు. ఆమోదం కోసం హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు పంపారు.

ఐటీ ఉద్యోగులకు అనుకూలంగా

ఐటీ ఉద్యోగులు పని చేసే ప్రదేశం నగరంలో ఉండాలని కోరుకుంటారు. పైగా పరిసర ప్రాంతాల్లో విలాసవంతమైన రెస్టారెంట్లు, కెఫెటేరియాలు, ఇతర మెట్రో సౌకర్యాలను కోరుకుంటారు. మడికొండలో ఐటీ పరిశ్రమలు మూడు ఏర్పాటు చేసినా పరిసరాలు నగర వాతావరణాన్ని తలపించడం లేదు. రాత్రివేళల్లో ఇక్కడ అందుబాటులో రెస్టారెంట్లు, ఇతర సౌకర్యాలు లేవు. దీంతో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు కంపెనీలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఐటీ పరిశ్రమలన్నీ సేవా రంగంతో ముడిపడి ఉన్న క్రమంలో విలాసవంతమైన భవనాలు నిర్మించి ఇస్తే, కంపెనీలు తమ కార్యాలయాలను ఏర్పాటుచేయడానికి ముందుకొస్తాయి. హనుమకొండ నగరం నడిబొడ్డులో అయితే బహుళజాతి కంపెనీలతోపాటు, అనేక అంకుర సంస్థలు కూడా ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉంటుందని భావించి ప్రభుత్వం నగరంలో ఐటీ టవర్ నిర్మించేందుకు సిద్ధమైంది. ఇక్కడ భవనం వస్తే రవాణా సౌకర్యంతోపాటు అన్ని రకాల వసతులు మెరుగ్గా ఉండడంతో ఐటీ విస్తరణ సాకారమయ్యే అవకాశం ఉంది.

# అన్నదాతల కంటతడి



ఖమ్మం : ఆలస్యంగానైనా సాగునీరందుతుందని సాగర్ ఆయకట్టు రైతులు ఆశించారు. కాలం కలిసొస్తుందనే నమ్మకం వారిని పంటల సాగుకు ఉపక్రమింపజేసింది. సీజన్ ఆరంభంలో కురిసిన వర్షాలతో బావులు, బోర్లలో పెరిగిన జలాలతో సాగుచేసిన పంటలు ఇప్పుడు మధ్యస్థ దశకు చేరాయి. మరో రెండు నెలలు నీరందిస్తేనే వరి, మిరప, పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు చేతికందే పరిస్థితి నెలకొంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో సరైన వర్షాలు కురవకపోవడంతో నాగార్జునసాగర్ జలాశయం పరిస్థితి దుర్భరంగా మారింది.

ఆయకట్టులో 80 శాతం విస్తీర్ణంలో పంటల సాగు

జిల్లాలోని 17 మండలాల్లో సాగర్ ఆయకట్టు విస్తరించి ఉంది. సాధారణంగా ఆయకట్టు పరిధిలో వర్షాకాలంలో 2,54,274 ఎకరాల్లో పంటలు సాగవుతుంటాయి. ఇందులో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో రైతులు వరి పండిస్తుంటారు. ఈఏడాది ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో 80 వేల ఎకరాలకే వరి పరిమితమైంది. మిరప, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు 1.26 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. మొత్తమ్మీద సాగర్ ఆయకట్టులో ఈసారి 80 శాతం విస్తీర్ణంలో వివిధ పంటలను రైతులు పండిస్తున్నారు.

ఎండుతున్న పైర్లు

తల్లాడ, కల్లూరు, పెనుబల్లి తదితర మండలాల్లో సాగునీరందక పంటలు ఎండుతున్నాయి. కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో బావులు, బోర్లల్లో జలం అడుగంటుతోంది. సాగర్ కాల్వకు ఒకట్రెండు సార్లు నీటిని విడుదల చేస్తేనే ఆయకట్టులో బోర్లు, బావులు జలకళ సంతరించుకుంటాయని రైతులు చెబుతున్నారు. వారబందీ విధానంతో కనీసం మూడు, నాలుగు విడతలుగా సాగునీరందిస్తేనే పంటలు చేతికందుతాయని, లేనిపక్షంలో నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

కనీసం మూడు తడులు అవసరం

సాగర్ ఆయకట్టు పరిధిలో పైర్లను కాపాడాలంటే కనీసం మూడు తడులకు నీరందించాలని రైతులు కోరుతున్నారు. గతంలో మాదిరిగా పది రోజులు నీళ్లిచ్చి.. మరో పదిరోజులు సరఫరా నిలిపేసే విధానం (వారబందీ) అవలంబించాలని వేడుకుంటున్నారు. పాలేరు జలాశయం నుంచి ఎడమ కాల్వ రెండో జోన్‌కు రోజుకు 4వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేసినా ప్రతి విడతకు 40వేల క్యూసెక్కుల నీరు అవసరం. ఇది 3.5 టీఎంసీలకు సమానం. ఈ విధంగా మూడు తడులకు కనీసం 10.50 టీఎంసీల నీరు అవసరం. ఈమేరకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టులో పైర్లను కాపాడేందుకు కనీసం నాలుగు తడుల నీరు అవసరమని ప్రభుత్వానికి నివేదించాం. సాగర్ జలాశయంలో నీటి లభ్యత ఆధారంగా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారు. విద్యాసాగర్, సీఈ, జలవనరుల శాఖ

# అడవుల్లోనే మనుగడ



ఖమ్మం : జిల్లాలో ఈ నెల మొదటి వారంలో 'వన్యప్రాణి సప్తాహం' నిర్వహించేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం నుంచి వారం పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనుంది. పార్కులు, అడవుల్లో ఉండే వన్యప్రాణుల, పర్యాటక ప్రాంతాలను చూసేందుకు వనదర్శిని పేరిట విద్యార్థులు, ప్రజలను అడవుల్లోకి అనుమతించనుంది. వెలుగుమట్ల అర్బన్ అటవీ పార్కు, సత్తుపల్లిలోని అర్బన్ అటవీ పార్కులో వన్యప్రాణులను చూసే అవకాశం కల్పిస్తుంది. వీటితో పాటు కనకగిరి అటవీ ప్రాంతాల్లో వాచ్ టవర్ల ద్వారా అటవీ అందాలను వీక్షించవచ్చు. పులిగుండాల ప్రాంతంలోని ప్రకృతి అందాలు, వన్యప్రాణులు, పక్షులు, వన నర్సరీలు, జలపాతాలను ఆస్వాదించవచ్చు. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న ప్రజలకు అడవుల వల్ల కలిగే లాభ, నష్టాలపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పిస్తారు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకు ఏం చేయాలనే విషయంపై చైతన్యపరుస్తారు. వన్యప్రాణులను వేటాడటం వల్ల చట్ట ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియజేస్తారు. పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యంపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వివరిస్తారు.

ఇవీ కార్యక్రమాలు..

వన్యప్రాణి సప్తాహం అక్టోబరు 3 నుంచి ప్రారంభమవుతుంది. అదేరోజు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా విద్యాసంస్థల అధిపతులు, ఎన్‌జీఓలు, వన్యప్రాణి సప్తాహ కార్యక్రమంలో పాల్గొనేలా కార్యక్రమాలను రూపొందిస్తారు.

సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలు, అర్బన్ పార్కులు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, జింకల పార్కులు తదితర వాటిలోకి పాఠశాల, కళాశాల విద్యార్థులను సందర్శనకు తీసుకెళ్లాలి. యువజన, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో గుట్టలు ఎక్కడం, పక్షులను పరిశీలించటం లాంటి కార్యక్రమాలు చేపడతారు.

విద్యార్థులకు చిత్రలేఖనం, పెయింటింగ్, వ్యాస రచన, క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలి.

డివిజన్, జిల్లాస్థాయిలో ర్యాలీలు, సైకిల్ యాత్రలు, నడక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు.

వన్యప్రాణులు, వాటి సంరక్షణ తదితర వివరాల గురించి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రద్దీగా ఉండ్టే కూడళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద అడవుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు బ్యానర్లు, గోడపత్రికలు, హోర్డింగులు, బ్రోచర్లు ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం కల్పిస్తారు.

జిల్లా భౌగోళిక విస్తీర్ణం: 4,36,100 హెక్టార్లు

అటవీ విస్తీర్ణం: 63,941.9 హెక్టార్లు

అటవీ శాతం: 14.66

డివిజన్లు: 2

రేంజిలు: 8

సెక్షన్లు: 33

బీట్లు: 113

అర్బన్ పార్కులు....

వెలుగుమట్ల అటవీ పార్కు, ఖమ్మం అర్బన్

నీలాద్రి అర్బన్ పార్కు, సత్తుపల్లి

అడవులపై అవగాహన కల్పిస్తాం..

సిద్దార్థ విక్రమ్ సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేస్తాం. వారందరికీ అడవులపై అవగాహన కల్పిస్తాం. అడవుల వల్ల ప్రయోజనాల గురించి వివరిస్తాం. అడవుల అందాలు, వన్యప్రాణులు, పక్షులు, అనేక రకాల చెట్ల జాతుల గురించి ప్రత్యక్షంగా అడవుల్లోకి వెళ్లి తెలుసుకునే అవకాశం కల్పిస్తాం. నగరాల్లో ఉండే అర్బన్ పార్కులు, రిజర్వ్ ఫారెస్టుల్లో వనదర్శిని ద్వారా విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తాం. విద్యార్థులు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

# సంరక్షణ కేంద్రం.. చిత్తశుద్ధి శూన్యం

అచ్చంపేట : మహబూబ్‌నగర్ పురపాలికలో ఏర్పాటు చేసిన జంతు సంరక్షణ కేంద్రం ఏడాదికే మూతపడింది. వీధి కుక్కలకు సంతతి నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు పురపాలికతో ఒప్పందం కుదుర్చుకున్న ఓ స్వచ్ఛంద సంస్థ బిల్లులు ఇవ్వడం లేదని కార్యకలాపాలు నిలిపివేసి కేంద్రానికి తాళం వేసింది. కేంద్రం మూతపడటంతో పట్టణంలో వీధికుక్కలు మళ్లీ స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా చేరి జనంపై దాడులు చేస్తున్నాయి. రాత్రి వేళ ద్విచక్రవాహనదారుల వెంట పడుతున్నాయి. జిల్లా కేంద్రానికి సమీపంలోని మౌలాలిగుట్టపై పట్టణ ప్రగతి నిధులు రూ. 53.90 లక్షలు వెచ్చించి గతేడాది మార్చిలో జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛత ఎనిమల్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థకు కేంద్రం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ సంస్థ అదే ఏడాది ఏప్రిల్‌లో కార్యకలాపాలు ప్రారంభించింది. 2022 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకు 11 మాసాల పాటు పట్టణంలోని వీధి కుక్కలను తమ సిబ్బందితో పట్టుకుని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులతో సంతతి నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించారు. ఇలా ఒక్కో కుక్కకు శస్త్రచికిత్స చేసినందుకు పురపాలిక రూ. 1,400 చొప్పున చెల్లించేలా సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ లెక్కన 11 మాసాల్లో 3,146 వీధి కుక్కలకు ఆపరేషన్లు చేసి వారం పాటు కేంద్రంలో సంరక్షించి వదిలిపెట్టారు. ఈ ప్రక్రియ పూర్తి చేసినందుకు స్వచ్ఛంద సంస్థకు రూ. 44,04,400 బిల్లు అయ్యింది. ఈ ఏడాది మార్చి నుంచి మే వరకు మూడు మాసాలు 514 వీధి కుక్కలకు సంస్థ ఆధ్వర్యంలో జంతు సంరక్షణ కేంద్రంలో ఆపరేషన్లు చేశారు. ఇందుకు రూ. 7,19,600 బిల్లు అయ్యింది. మొత్తంగా స్వచ్ఛంద సంస్థకు రూ. 51,24,000 బిల్లు చెల్లించాల్సి ఉండగా ఇందులో సుమారు రూ. 22 లక్షల వరకు మంజూరు చేసినట్లు తెలిసింది.

# అంటువ్యాధుల విజృంభణ

కొత్తగూడెం : జిల్లాలో సంభవించే పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లోని హెచ్చు తగ్గుల ప్రభావం ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. రోజంతా ఉక్కపోత, చెమటతో శరీరాలు ఉడికిపోతున్నాయి. రాత్రయితే మబ్బులు పట్టిన చల్లటి గాలులు వీస్తున్నాయి. మూడు వారాలుగా నెలకొన్న అసమతౌల్య వాతావరణం వైరల్ ఇన్‌ఫెక్షన్లు వ్యాప్తిచెందేందుకు కారణమవుతోంది. ఏ ఇంట చూసినా వైరల్ జలుబు, దగ్గు, జ్వరం, తల, గొంతునొప్పి, శ్వాసకోశ సమస్యలతో బాధపడే పిల్లలు, పెద్దలు కనిపిస్తున్నారు.

ఏమిటీ తేడా..ఇటీవల నుంచి పగటి పూట ఉష్ణోగ్రతలు సగటున 35 నుంచి 38 డిగ్రీల వరకు నమోదవుతుంటే.. రాత్రి 15 నుంచి 18 డిగ్రీలకు పడిపోతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రత కంటే ఐదు డిగ్రీలు పెరిగినా, తగ్గినా అసాధారణ వాతావరణంగా పరిగణిస్తారని ఆ రంగం నిపుణులు పేర్కొన్నారు. గంటల వ్యవధిలోనే తారెత్తించే ఉష్ణోగ్రతల వ్యత్యాసాలను కొందరి శరీరాలు తట్టుకోలేక పోవచ్చని వైద్యులు తెలుపుతున్నారు. దీనివల్ల కొందరు ఉన్నట్టుండి అనారోగ్యం పాలవుతారని



చెప్పారు. ఆసుపత్రులకు బాధితుల బారులు

విష జ్వరాలకు తోడు జలుబు, దగ్గు, తుమ్ములు వంటి సమస్యలు జిల్లా వాసులను వేధిస్తున్నాయి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులకు సమస్య కాస్త తీవ్రంగా కనిపిస్తోంది. కళ్లు, ముక్కుల నుంచి నీళ్లు కారడం, నేత్రాలు ఎర్రబారడం వంటి సమస్యలతో చాలా మంది చికిత్సపొందుతున్నారు. వాతావరణ మార్పులతో వ్యాపించిన వైరల్ వ్యాధులతో కొత్తగూడెంలోని జిల్లా సర్వజనాసుపత్రిలో ఒక్క సెప్టెంబరులోనే 500 మంది ఇన్‌పేషెంట్లుగా చేరినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. రోజుకు సగటున వీరి సంఖ్య 40గా నమోదవుతోంది. బాధితుల్లో సుమారు 40 శాతం మంది చిన్నారులు, వృద్ధులే ఉంటున్నారు. జిల్లాలోని వైద్య విధాన పరిషత్ దవాఖానాలకూ రోజుకు సగటున 15 నుంచి 40 మంది వరకు వైరల్ సమస్యల చికిత్సకు తరలివస్తున్నారు. ఔట్ పేషెంట్లు వందల్లో ఉంటున్నారు. గ్రామీణ, పట్టణ వైద్యులు కాకుండా (ఆర్ఎంపీలు, పీఎంపీలు) ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వారు రోజుకు వేలల్లో ఉంటున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు వంటి పట్టణాల్లో రద్దీ, పారిశ్రామిక భారీ వాహనాల కారణంగా వాయుకాలుష్యం మరింత బాధిస్తోంది. ధూళికణాలతో శ్వాసకోశ ఇబ్బందులు పెరుగుతున్నాయి. నీరు, ఆహార కాలుష్యంతో టైఫాయిడ్, పచ్చ కామెర్ల సమస్యలూ విజృంభిస్తున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

స్వీయ జాగ్రత్తలు మేలు

డాక్టర్ ఎ.పుష్పలత, జనరల్ ఫిజీషియన్ (ఎండీ), కొత్తగూడెం జిల్లా సర్వజన ఆసుపత్రి

కాచి చల్లార్చి, వడపోసిన నీటిని తాగడం చాలా అవసరం. లేదంటే ఇంట్లోనే నీటి శుద్ధి పరికరాలు (ప్యూరిఫయర్) వంటివి పెట్టుకోవడం వల్ల కొంత వరకు నీటి జనిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. డీహైడ్రేషన్ బారినపడకుండా తరచూ నీళ్లు తాగాలి. వైరల్ ఇన్‌పెక్షన్లు సోకకుండా చేతుల శుభ్రత పాటించాలి. బయటకు వెళ్లొచ్చాక కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. తుమ్మినా, దగ్గినా చేతి రుమాలు అడ్డం పెట్టుకోవాలి. జలుబు, దగ్గుతో బాధపడే వారున్న ఇంట్లో పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. వాయుకాలుష్యం వెదజల్లే జంక్షన్లు, రద్దీ రహదారుల్లో వెళ్లేటప్పుడు మాస్కు, కళ్లద్దాలు ధరించాలి. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లోని ఆసుపత్రులకు చికిత్స కోసం వచ్చేవారిలో 20 శాతం మంది శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు. జ్వరం, తలనొప్పి, ఒళ్ల నొప్పులు, గొంతు నొప్పి వంటివి మూడు రోజుల కంటే ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలి. థర్మామీటర్‌ను ఇంట్లో ఉంచుకోవడం శ్రేయస్కరం. 100 డిగ్రీల కంటే ఎక్కువ జ్వరం ఉంటే తక్షణమే చికిత్స పొందాలి.

# ఆధార్ నవీకరణ కష్టాలు

భగత్‌నగర్ : రేషన్ కార్డుకు ఈకేవైసీ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడంతో ప్రజలు రేషన్ దుకాణాలకు పరుగెత్తుతున్నారు. కానీ చాలామందికి వేలిముద్రలు, కనుపాపలు, చరవాణి నంబర్లు ఆధార్‌తో అనుసంధానం లేకపోవడంతో ఈకేవైసీ నమోదు కావడం లేదు. ఎక్కువ మంది ఆధార్ నవీకరణకు ఈ–సేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఆధార్ అనుసంధానానికి పరిమితులు ఉండటంతో భారీ సంఖ్యలో వచ్చి అప్‌డేట్ కాక తిరుగుముఖం పడుతున్నారు. కొన్ని బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్, తపాలా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నా.. అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారు.

ఆ కేంద్రాల్లో పరిమితులు..

నవీకరణ కేంద్రాల్లో రోజుకు 60, గంటకు ఆరు దరఖాస్తులను మాత్రమే ఆధార్ నవీకరణ చేసే అవకాశముంది. అంతకంటే ఎక్కువ చేస్తే నమోదు కాదు. సర్వర్ డౌన్ అవుతుంది. సరికావడానికి రోజు నుంచి వారం రోజుల సమయం పడుతుందని నిర్వాహకులు వాపోతున్నారు. నిబంధనలకు మించి దరఖాస్తులు తీసుకోకపోవడంతో ప్రజలు గొడవకు దిగుతున్నారు. అధిక మంది స్థానికేతరులు వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

మండలాల్లో సహకారం కరవు

కేంద్ర ప్రభుత్వం శాశ్వత ఆధార్ కేంద్రాలను మండలాల్లో ఏర్పాటు చేసిన ప్రజలకు అక్కడ సరైన సేవలు అందక జిల్లా కేంద్రం వైపు వస్తున్నారు. నవీకరణకు గ్రామాల నుంచి నగరానికి ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో నగరంలోని ఈ–సేవ కేంద్రాలు కిక్కిరిసిపోతున్నాయి. ప్రజలు ఉదయం అయిదు గంటలకే కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కొందరు నిర్వాహకులు టోకెన్లు జారీ చేస్తూ ఫలానా రోజు రమ్మంటూ వారికి స్లాట్ బుకింగ్ మాదిరిగా సమయం కేటాయిస్తున్నారు.

రెండోసారి వచ్చా..బెజ్జంకిలో నా భార్యది, నాది మాత్రమే ఆధార్ అప్‌డేట్ అయింది. పిల్లలది అప్‌డేట్‌కు కరీంనగర్ వెళ్లమని చెప్పగా.. శనివారం వచ్చా. ఆ రోజు అవకాశం దొరకకపోవడంతో మంగళవారం ఉదయం 6 గంటలకే ఈ–సేవ కేంద్రం వద్దకు చేరుకున్నా.

జె.శ్రీనివాస్, బేగంపేట, సిద్దిపేట

వేలిముద్ర పడటం లేదురేషన్‌కార్డుకు వేలిముద్ర రావడంలేదని సుల్తానాబాద్ వెళ్తే అక్కడ పని జరగక కరీంనగర్‌కు వచ్చాను. ఇక్కడ కూడా కంప్యూటర్‌లో వేలిముద్రలు తీసుకోవడంలేదు. నవీకరణ జరగడంలేదు.

రాజేశ్వరి, గర్రెపెల్లి, పెద్దపల్లి

ఈ–కేవైసీకి గడువు లేదుప్రభుత్వం రేషన్‌కార్డుకు ఈ–కేవైసీ చేయించుకోవడానికి ప్రత్యేకంగా గడువు విధించలేదు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.సురేశ్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి

# స్వగృహకు తప్పని పాట్లు

పెద్దపల్లి : జిల్లాలో రాజీవ్ స్వగృహ స్థలాలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగా మూడు, నాలుగు రెట్లు ఎక్కువకు వేలం పాడిన వాళ్లు మొత్తం డబ్బులు చెల్లించాల్సిన సమయంలో చేతులెత్తేయడం చర్చనీయాంశమైంది. గత నెల 15, 16 తేదీల్లో అంతర్గాం మండలం కుందనపల్లి వద్ద రాజీవ్ స్వగృహ అక్షయ టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లకు సంబంధించి వేలం ప్రక్రియ నిర్వహించారు. వాణిజ్య, గృహ సముదాయాలకు సంబంధించి 100 ఖాళీ స్థలాలకు వేలం పూర్తి చేయగా ప్రభుత్వానికి రూ.19.62 కోట్ల ఆదాయం సమకూరింది.

**పరిసర వెంచర్ల ధర పెంచేందుకే..!**

రామగుండం, పెద్దపల్లి వంటి అభివృద్ధి చెందుతున్న పట్టణాలకు చుట్టుపక్కల ఉన్న ఖాళీస్థలాల ధరలు అమాంతం పెంచుకుని సొమ్ము చేసుకునేందుకే స్థిరాస్తి వ్యాపారులు వేలంలో పాల్గొన్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం 22 మంది రూ.10 వేల చొప్పున ధరావతు చెల్లించి వేలంలో ప్లాట్లు దక్కించుకున్నారు. కాగా మొత్తం డబ్బులు చెల్లించాల్సిన సమయంలో స్పందించడం లేదు. వీరిలో ఎక్కువ మంది స్థానిక రియల్టర్లే ఉండటం గమనార్హం. రియల్టర్లు, బిల్డర్లు ఉద్దేశపూర్వకంగా వేలం ప్రక్రియలో పాల్గొని గజానికి గరిష్ఠంగా రూ.20 వేలకు పాడగా తీరా డబ్బులు కట్టాల్సిన సమయంలో స్పందించడం లేదు. వీరంతా వ్యూహాత్మకంగా వ్యవహరించి సమీపంలోని తమ వెంచర్లను అభివృద్ధి చేసుకుని వ్యాపారాన్ని పెంచుకున్నారు.

**అక్షయ టౌన్‌షిప్ పేరిట..**

'అక్షయ' టౌన్‌షిప్ పేరిట మొత్తం 27 ఎకరాల భూములుండగా 2006 నుంచి 2013 వరకు 36 మందికి 200, 250 గజాల చొప్పున విక్రయించారు. 200 గజాల స్థలానికి రూ.16.80 లక్షలతో పాటు అభివృద్ధి పనుల పేరిట 10 శాతం రుసుము వసూలు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక పడక గది, హాల్, కిచెన్, అటాచ్‌డ్ బాత్‌రూమ్‌తో పాటు ఇంటిపైన స్లాబ్ వేసి రెండు గదులు, అటాచ్‌డ్ బాత్‌రూమ్‌లతో అప్పట్లో ప్రభుత్వమే నిర్మించింది. వాటిని విక్రయించి రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా కొనుగోలుదారులకు అందజేసింది. అయితే గృహనిర్మాణ పథకం నిలిపివేయడంతో కేవలం ఖాళీ స్థలాలను విక్రయించడమే లక్ష్యంగా మార్చి 15, 16 తేదీల్లో కుందనపల్లిలో వేలం ప్రక్రియను అధికారికంగా నిర్వహించారు.

ఆసక్తి చూపింది 78 మంది మాత్రమే మొత్తం 100 ప్లాట్లను వేలం వేయగా ముందుగా రూ.10 వేలు చొప్పున ధరావతు చెల్లించి పాల్గొనాల్సి ఉంటుంది. అనంతరం ప్లాటు దక్కితే ధరావతు సొమ్ము తిరిగి ఇవ్వరు. దక్కకుంటే చెల్లిస్తారు.వేలంలో ప్లాటు దక్కిన వారు వారం రోజుల్లోగా మొదటి విడతగా 33 శాతం డబ్బులు, రెండో విడతగా 45 రోజుల్లో 33 శాతం, మిగిలిన మొత్తాన్ని 90 రోజుల్లో పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది.అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా నిరభ్యంతర పత్రం(ఎన్వోసీ) జారీ చేసి ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు రుణం, ఇతర నిర్మాణ ప్రక్రియను ప్రారంభించుకునే అవకాశం కల్పించారు. కాగా వేలంలో ప్లాటు దక్కించుకున్న వారికి ఇచ్చిన గడువు దాటినా డబ్బు చెల్లించకపోవడంతో 22 మందికి చెందిన రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2.20 లక్షలు ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయి. మిగిలిన 78 మందిలో 37 మంది పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించగా మిగిలిన వారు గడువులోగా కట్టనున్నారు. వీరికి మరో వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయనున్నారు. కాగా 22 ప్లాట్లకు సంబంధించి తిరిగి వేలం ప్రక్రియ నిర్వహణకు త్వరలో ప్రకటన చేయనున్నారు.

# అంగన్‌వాడీల్లో సిబ్బంది లేక ఇబ్బంది!

భైంసా : చిన్నారులు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించి వారి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అమలు చేసిన సమగ్ర మాతా శిశు సంరక్షణ అభివృద్ధి పథకంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించింది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో సొంత భవనాలు నిర్మించకపోవడం, కేంద్రాల్లో పర్యవేక్షకుల, ఉపాధ్యాయుల, ఆయాల ఖాళీలను భర్తీ చేయకపోవడం ప్రధానంగా కన్పిస్తోంది. కొన్నేళ్లుగా ఏర్పడ్డ ఖాళీలు భర్తీకి కావడం లేదు. గతసంవత్సరం ఖాళీలను భర్తీ చేస్తామని వివరాలు సేకరించినా కాగితాలకే పరిమితమయ్యాయి. చాలా కేంద్రాలను ఇన్‌ఛార్జులతో నడిపిస్తున్నారు.



అద్దెగదులు ఇరుకుగా ఉండటంతో ఆట స్థలాలు లేవు. కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేక గర్భిణులు, చిన్నారులు, బాలింతలు పౌష్టికాహారానికి దూరమై రక్తహీనత, బలహీనతతో అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రసూతి సమయాల్లో మాతా, శిశుమరణాలు జరుగతున్నాయి.

ఆటపాటలు.. అక్షరాలకు దూరం : జిల్లాలో 19 పర్యవేక్షకుల, 50 కేంద్రాల్లో ఉపాధ్యాయులు, 91 కేంద్రాల్లో ఆయాల నియామకాలు లేకపోవడంతో చిన్నారులు ఆటపాటలు, అక్షరాలకు దూరమవుతున్నారు. పోస్టులు ఖాళీ ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యత సమీప గ్రామం లేదా పక్కన కాలనీ ఉపాధ్యాయులకు అప్పగించారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్న ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భైంసా మండలం పేండ్‌పెల్లిలోని ఒకే గదిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 120మంది చిన్నారులు, 30మంది గర్భిణులు ఉన్నారు. సరకుల నిల్వ, వంట అక్కడే చేయడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు మాంజ్రి పాఠశాల భవనం సముదాయంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలి నియామకం లేదు. ఇక్కడ 58 చిన్నారులు, 12 గర్భిణులకు ఆయానే సేవలందిస్తోంది. 63మంది పిల్లలు, 14మంది గర్భిణులు ఉన్న సిరాల కేంద్రం ఉపాధ్యాయురాలకే ఇక్కడి బాధ్యతలను అప్పగించారు. 5కి.మీ. దూరం ఉండడంతో ఆమె రెండు, మూడు రోజులకు ఒకసారి వచ్చి సరుకులు ఆయాకు ఇచ్చి వెళ్తున్నారు.

**ప్రభుత్వానికి నివేదించాం..విజయలక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి నిర్మల్**

జిల్లాలోని ఖాళీల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం గ్రేడు-2 సూపర్‌వైజర్ల పరీక్ష ఫలితాలు వచ్చాయి. ఇంటర్వ్యూలు అయ్యాక నియామకాలు పూర్తవుతాయి. ఈ పరీక్షలు రాసిన వారిలో ఉపాధ్యాయులు కాబట్టి పర్యవేక్షకుల నియామకాలు అయ్యాక ఏర్పడే ఉపాధ్యాయ ఖాళీలను మరోసారి ప్రభుత్వానికి అందిస్తాం. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి ఖాళీలను భర్తీ చేస్తుంది.

# నిరుద్యోగుల సాపాట్లు

సిరిసిల్ల : ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు జిల్లాలోని నిరుద్యోగ యువత పుస్తకాలతో కుస్తీ పడుతోంది. త్వరలో వరుస నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉండటంతో పూర్తిస్థాయిలో సన్నద్ధతపైనే దృష్టి సారిస్తున్నారు. ఇదే క్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా నలుమూలల నుంచి ఉదయం ఏడు గంటలకే సిరిసిల్లకు చేరుకుంటున్నారు. రాత్రి 9 గంటల వరకు ఇక్కడే చదువుకుంటున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చేవారు ఉదయం వీలైతే బాక్సుల్లో భోజనం తీసుకొస్తున్నారు. వీలుకాని వారు రాత్రి ఇంటికి వెళ్లే వరకు చదువుతూ అర్ధాకలితోనే ఉంటున్నారు.జిల్లా గ్రంథాలయానికి నిత్యం 300 మంది పైనే నిరుద్యోగ యువత సన్నద్ధత కోసం వస్తున్నారు. వీరిలో చాలా మంది మారుమూల గ్రామాల నుంచి వచ్చేవారే ఎక్కువగా ఉన్నారు. రాబోయే రోజుల్లో పోలీసు ఉద్యోగాలకు శిక్షణ, బీసీ, ఎస్సీ అధ్యయన కేంద్రాల ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో నిత్యం పట్టణానికి వచ్చే అభ్యర్థుల సంఖ్య మరింత పెరగనుంది. వీరంతా ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణంలోనే ఉండి పుస్తకాలతో కుస్తీ పట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయమే ఇంటి వద్ద భోజనం సిద్ధం చేసుకోలేని పరిస్థితి ఉంటుంది. పట్టణానికి వచ్చాక హోటల్‌లో భోజనం చేస్తే రూ.80 నుంచి రూ.100 ఖర్చవుతుంది. పేదలకు ఇది సాధ్యం కాదు. డబ్బులు పెట్టి తినలేక సాపాట్లు పడుతున్నారు. పురపాలక శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి సమీపంలో రూ.5లకు అన్నపూర్ణ పథకంలో భోజనం అందజేస్తుంది. ఇక్కడ రోజు కూలీలు, వస్త్రపరిశ్రమలోని కార్మికులు, ఆటోవాలాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు మధ్యాహ్నం కడుపునిండా భోజనం చేస్తున్నారు. నిత్యం 500 మందికి సరిపడా భోజనాలు అందిస్తున్నారు. గ్రంథాలయం వద్ద కూడా ఒక కేంద్రాన్ని నడిపితే తమ భోజనం పాట్లు తప్పుతాయని, కనీసం నాలుగైదు నెలలు తాత్కాలికంగా ఏర్పాటు చేసినా తమకు ఉపయుక్తంగా ఉంటుందని కోరుతున్నారు.

**మంత్రి దృష్టికి...అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో పాల్గొనడానికి** పట్టణానికి వచ్చిన మంత్రి కేటీఆర్ దృష్టికి గ్రంథాలయంలోని నిరుద్యోగ అభ్యర్థుల ఆకలి సమస్యను తీసుకెళ్లారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన మంత్రి కేటీఆర్ త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అలాగే పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచేలా కరీంనగర్‌కు చెందిన బుక్‌స్టాల్ నిర్వాహకులు గ్రంథాలయంలో పుస్తక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు వెయ్యికి పైగా చరిత్ర, వివిధ రకాల పోటీ పరీక్షలకు అవసరమైనవి ఉన్నాయి. అలాగే మనసున్న దాతలు ముందకొచ్చి మధ్యాహ్న భోజనం కూడా సమకూరిస్తే నిరుపేదల నిరుద్యోగులకు మేలు చేసినవారు అవుతారు.

**సమయం కలిసివస్తుంది- శ్రీకాంత్, వేములవాడ**

నేను గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నాను. ఉదయమే వేములవాడ నుంచి వస్తున్నాను. ఆ సమయంలో టిఫిన్ చేసి వస్తున్నాను. అన్నం వండుకునేందుకు మరింత సమయం పడుతుంది. మధ్యాహ్నం తిరిగి వెళ్లలేని పరిస్థితుల్లో పక్కన ఉన్న అన్నపూర్ణ భోజనం కేంద్రంలో రూ.5లకు భోజనం చేస్తున్నాం. ఇక్కడే భోజన వసతి ఏర్పాటు చేస్తే సమయం కలిసివస్తుంది.

**భోజన వసతి కల్పించాలి- మహేష్, సిరిసిల్ల**

జిల్లా న్యాయస్థానంలో టైపిస్టుగా పని చేస్తూనే గ్రూప్-1కు సిద్ధమవుతున్నాను. ఉద్యోగరీత్యా సిరిసిల్లకు వచ్చి ఉంటున్నాను. ఉదయం ఏడు గంటలకే వచ్చి కార్యాలయం తెరిచే సమయం వరకు చదువుకుంటున్నాను. కార్యాలయం ముగిశాక.. సెలవుదినాల్లోనూ ఇక్కడే చదువుకుంటున్నాను. ఇక్కడే భోజన వసతి కల్పిస్తే నాలాంటి వారికి ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది.

# నిర్ధారణ పరీక్షలకు విఘాతం



ఆదిలాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన వ్యాధి నిర్ధారణ పరీక్షల వ్యవస్థ నిర్వహణ సరిగా లేదు. ఇందులో మొత్తం 57 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయటానికి ఏర్పాట్లు చేశారు. రిమ్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలోని బయోకెమిస్ట్రీ పరీక్షలు చేసే ఆటో ఎనలైజర్ యంత్రం వారం కిందట పాడైంది. రిమ్స్‌లో ఉన్న మరో యంత్రం మూడు రోజులుగా మొరాయిస్తోంది. దీంతో నిర్ధారణ పరీక్షలన్నీ నిలిచిపోయాయి. జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల నుంచి వచ్చే నమూనాలకు, రిమ్స్‌లో రోగుల నుంచి సేకరించే నమూనాల నిర్ధారణ పరీక్షలు చేయలేకపోతున్నారు. బయోకెమిస్ట్రీ ఎనలైజర్ యంత్రం పని చేయక ఇందులో చేసే డయాబెటిక్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ టెస్ట్, రీనల్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, సిరం ఎలక్ట్రోలైట్స్, తదితర మొత్తం 32 రకాల నిర్ధారణ పరీక్షలు చేయడం లేదు. ప్రస్తుతం ఇతర యంత్రాలపై చేసే 25 రకాల పాథలాజీ పరీక్షలు, థైరాయిడ్ పరీక్షలు మాత్రమే జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి రిమ్స్‌లోనూ నెలకొంది. టీహబ్‌లో పని చేసే సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ల(పీహెచ్‌సీల నుంచి డిప్యూటేషన్‌పై పని చేసే వారిని)ను తొలగించి రిమ్స్‌లో పని చేసే వారితో పరీక్షలు చేయిస్తున్నారు. నిర్వహణ సరిగా లేకనే పరిస్థితి నెలకొందనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

**సెల్ కౌంటర్‌దీ అదే పరిస్థితి..**

రిమ్స్‌లోనూ రక్త నమూనాల సీబీపీ పరీక్షలు చేసే సెల్ కౌంటర్ మరమ్మతులకు గురైంది. రిమ్స్ పాథలాజీ విభాగంలో రెండు సెల్ కౌంటర్లలో రెండేళ్ల కిందటే మూలన పడగా రెండో సెల్ కౌంటర్ తరచూ చెడిపోతోంది. కొన్నాళ్లు పట్టణ పీహెచ్‌సీ నుంచి సెల్ కౌంటర్ తీసుకొచ్చి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం ఆ పీహెచ్‌సీ వారు ఆ యంత్రాన్ని తీసుకెళ్లటంతో పాత దానికి మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం అది మళ్లీ పాడైంది. దీంతో టీహబ్‌లోని సెల్ కౌంటర్ యంత్రంపైనే సీబీపీ పరీక్షలు చేస్తున్నారు.

**పాడై వారం రోజులు..**రిమ్స్‌లోని తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రం (టీహబ్) లో బయో కెమిస్ట్రీ పరీక్షలు చేసే యంత్రం ఇది. వారం రోజుల కిందట పాడైంది. రిమ్స్‌తోపాటు జిల్లాలోని 20 పీహెచ్‌సీల నుంచి వచ్చే నమూనాల నిర్ధారణ పరీక్షలు ఆగిపోయాయి.

**రిమ్స్‌లోనూ మూడురోజులుగా అంతరాయం**

బయో కెమిస్ట్రీ విభాగంలోని ఆటో ఎనలైజర్ యంత్రం మూడు రోజులుగా మొరాయిస్తోంది. ఈ విభాగంలో కేవలం రెండు ఏసీలు మాత్రమే ఉండటంతో ఎండ వేడిమికి తరచూ యంత్రం పని చేయకుండా మొరాయిస్తున్నట్లు సమాచారం. దీంతో నిత్యం 1,500లకు పైగా జరిగే నిర్ధారణ పరీక్షలు నిలిచిపోయాయి.

**కేవలం 600 పరీక్షలే..**ఇది రిమ్స్‌లోని బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లోని చిత్రం. నిర్ధారణ పరీక్షలు చేసే ఆటో ఎనలైజర్ యంత్రం మొరాయించటంతో సిబ్బందే నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. దీంతో రోజంతా కేవలం 500 నుంచి 600 నిర్ధారణ పరీక్షలు మాత్రమే జరుగుతున్నాయి.

**మరమ్మతులు చేయిస్తాం**

ఆటో ఎనలైజర్లు సరిగా పని చేసేలా సంబంధిత కంపెనీ ఇంజినీర్లకు సమాచారం అందించి వీలైనంత తొందరగా మరమ్మతులు చేయిస్తాం. నిర్వహణ తీరును సైతం మెరుగుపర్చటానికి చర్యలు తీసుకుంటాం.

# ఆదాయంపైనే గురి.. వసతులు హారీ

నిర్మల్ : ఉమ్మడి జిల్లా పరిధిలో పెద్దదైన స్థానిక ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నిర్వహణలోపంతో కొట్టుమిట్టాడుతోంది. 1977లో ప్రారంభమైన ఈ బస్టాండ్‌లో కనీస మౌలిక వసతుల్లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలి కాలంలో పదేపదే అదనపు ఛార్జీలు విధిస్తున్న అధికారులు సౌకర్యాల కల్పనను మాత్రం విస్మరించారు.

**పెరిగిన సెస్..**ప్రయాణికుల సౌలభ్యం కోసం ప్రయాణ ప్రాంగణంలో కుర్చీలు, తాగునీరు, ఫ్యాన్లు తదితర వసతులు కల్పించేందుకు, నిర్వహించేందుకు గాను ప్రత్యేకంగా సెస్ రుసుమును వసూలు చేస్తున్నారు. గతంలో ఇది రూ.1 ఉండేది. పల్లెవెలుగుకు రూ.1, ఎక్స్‌ప్రెస్ ఆపైన ఉండే బస్సులకు రూ.5 చొప్పున పెంచారు. దాదాపు నెల రోజులుగా ఇది అమలవుతోంది. టికెట్ తీసుకునే ప్రతి ప్రయాణికుడు ఈ రుసుము తప్పనిసరిగా చెల్లించాలి. కేవలం సెస్ ఛార్జీల రూపంలోనే నిర్మల్ డిపోకు ప్రతిరోజూ దాదాపు రూ.2 లక్షల ఆదాయం సమకూరుతోంది. నెలకు రూ.60 లక్షలు. ఈ డబ్బులతో ప్రాంగణంలో సౌకర్యాలు మెరుగుపర్చడం పెద్దగా కష్టమేమీ కాదు. అయినా క్షేత్రస్థాయిలో అవస్థలు ఎదుర్కొంటున్నారంటే అధికారులు విఫలమవుతుండటమో, లేక వచ్చిన డబ్బులను సంస్థ ఇతర అవసరాలకు వినియోగించడమో జరుగుతోందనేది సుస్పష్టం.

**సమస్యలతో సహవాసం..**

సుమారు 45 సంవత్సరాల కిత్రం అందుబాటులోకి వచ్చిన ప్రయాణప్రాంగణం దినదినాభివృద్ధి చెందాలి. కానీ, ప్రయాణికులు, బస్సు సర్వీసుల సంఖ్య పెరుగుతున్నా ప్రయాణికులను అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు మాత్రం ఇంకా అందుబాటులోకి రావడం లేదు. ఇప్పటికీ సామగ్రి భద్రపర్చేగది లేదు. తాగునీరు, మూత్రశాలలకు అవస్థలే. వచ్చిన ప్రయాణికులు ఇక్కట్లతో సహవాసం చేయాల్సి వస్తోంది.

**తాళం వేసి ఉన్న గది**

ఇటీవల ఓ ఆసుపత్రి సౌజన్యంతో ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక గది ఇది. చంటిపిల్లలకు పాలిచ్చేందుకు తల్లులకు ఇబ్బందులు ఏర్పడొద్దని ఈ ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ గది తాళం వేసిఉంటోంది.

**మూత్రశాలలకు వెళ్లే దారేది..?**

ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన మూత్రశాలలను కొద్దిరోజుల క్రితం మూసేశారు. టెండర్ ప్రక్రియ పూర్తవకపోవడంతో దాన్ని ఎవరికీ కేటాయించలేదు. కావాల్సిన అద్దె లభించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే.. ఖాళీగా వదిలేసే బదులు, కాస్త అద్దె తక్కువైనా ఎవరికో ఒకరికి కేటాయిస్తే నిర్వహణ జరిగి అందరికీ సౌలభ్యంగా ఉంటుందని ప్రయాణికులు చెప్తున్నారు

**ఇదీ నిర్వహణ తీరు..**

ఎండలు మండుతున్నాయి. అందరూ గుక్కెడు నీటికోసం అల్లాడుతుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం దాతల సాయంతో కొద్దిరోజుల క్రితం నీటి ట్యాంకును ఏర్పాటుచేశారు. ప్రారంభంలో బాగానే ఉన్నా.. కొద్దిరోజుల అనంతరం పరిస్థితి ఎప్పటిలాగే మారింది. నిర్వహణ లేక తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**ప్రాంగణం ఆవరణలో చెత్త**

ప్రయాణ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే కనిపించే దృశ్యమిది. చెత్తచెదారం పేరుకుపోయింది. సకాలంలో తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. పలువురు బహిరంగ మూత్రవిసర్జన చేస్తున్నారు. గతంలో మున్సిపల్ వారు సేకరించిన చెత్తను అక్కడున్న స్థలాన్ని పూడ్చేందుకు గాను బస్టాండ్ ఆవరణలోనే పడేశారు.

# విధులు అక్కడ.. వేతనం ఇక్కడ..

మంచిర్యాల : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పనితీరు అస్తవ్యస్తంగా తయారైంది. మంచిర్యాలకు శాశ్వత జిల్లా అదనపు అధికారిగా డా.శ్రీరాంను నియమించినా ఇక్కడ విధులు నిర్వర్తించడంలేదు. పని ఉత్తర్వుల పేరిట జయశంకర్ భూపాలపల్లిలో కొనసాగుతూ వేతనం మాత్రం మంచిర్యాల నుంచే తీసుకుంటున్నారు.

**డిప్యూటీ సివిల్ సర్జన్లే.. జిల్లా అధికారులు**

వైద్యారోగ్యశాఖ జిల్లా బాధ్యతలు తప్పనిసరిగా సివిల్ సర్జన్‌స్థాయి వ్యక్తికి అప్పగించాలి. జిల్లాకు మొదటి అదనపు వైద్యాధికారిగా నియామకమైన డా.భీష్మ మాత్రమే సీఎస్ హోదాలో పని చేశారు. ఎక్కువ కాలం చేసింది కూడా ఆయనే. తన బదిలీ తర్వాత దాదాపు రెండేళ్లపాటు డీసీఎస్‌లతో నెట్టుకొచ్చారు. రెండు సంవత్సరాల్లో సుమారు నాలుగుసార్లు అధికారులను మార్చారు. గతేడాది ఏప్రిల్‌లో ప్రభుత్వం పలువురికి సీఎస్‌గా పదోన్నతి కల్పించడంతో మహబూబాబాద్‌లో డీసీఎస్‌గా కొనసాగుతున్న డా.శ్రీరాం మంచిర్యాల అదనపు వైద్యాధికారిగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన



కొద్ది రోజుల్లోనే ఇక్కడ పనిచేయడం ఇష్టంలేకనో.. ఒత్తిడి తట్టులేకనో.. మరే ఇతర కారణాలతో గానీ సెలవుపెట్టి వెళ్లిపోయారు.

సివిల్‌సర్జన్‌గా పదోన్నతితో జిల్లా అదనపు అధికారిగా బాధ్యతలు చేపట్టిన డా.శ్రీరాం ప్రస్తుతం విధులు మరోచోట నిర్వర్తిస్తున్నారు. సాధారణ బదిలీ అయ్యే వరకు ఆయన కేటాయించిన పోస్టులోనే కొనసాగాలి. కానీ డీహెచ్ నుంచి తనకున్న పలుకుబడితో పని ఉత్తర్వుల పేరిట బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లిజిల్లాలో తాత్కాలిక వైద్యాధికారిగా కొనసాగుతున్నారు. కానీ వేతనం మాత్రం మంచిర్యాల నుంచి పొందుతున్నారు. ప్రతినెల హాజరుపట్టిక భూపాలపల్లి నుంచి రావడం, ఇక్కడ నమోదు చేసుకుని వేతనానికి సంబంధించిన లెక్కలు చేసి ఖజానా శాఖకు పంపడం జరుగుతోంది. ప్రతినెల ఇదే తంతు. దీంతో జిల్లాలో తప్పని పరిస్థితుల్లో అర్హతలేని వారిని(డీసీఎస్) వైద్యాధికారిగా నియామకం చేసి కొనసాగించాల్సి వస్తోంది. తాత్కాలిక అధికారులను కేటాయిస్తుండటంతో తరచూ మార్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఏడాది వ్యవధిలోనే నలుగురిని మార్చడం గమనార్హం. ఇటీవల తాత్కాలికంగానైనా సీఎస్ స్థాయి వ్యక్తికి బాధ్యతలు అప్పగించడంతో శాఖ గాడిలో పడుతుందని అనుకున్నారు. విధుల్లో చేరినా కొద్దిరోజుల్లోనే అకస్మాత్తుగా ఆయనను తొలగించారు. దీంతో జిల్లా ఆరోగ్యశాఖకు మళ్లీ డీసీఎస్ స్థాయి వ్యక్తి దిక్కయ్యారు. ఉన్నతాధికారులు చొరవ చూపి జిల్లా నుంచే వేతనం పొందుతున్న శాశ్వత అధికారిని తిరిగి జిల్లాకు తీసుకురావడమో లేదా ఆయనను పూర్తిగా బదిలీచేసి శాశ్వత అధికారిగా మరొకరిని నియమించడమో చేయాలని ఆ శాఖ సిబ్బంది కోరుతున్నారు.

# అభయారణ్యంలో ప్లాట్ల దందా..

ఇంద్రవెల్లి: జిల్లాలోని ఏజెన్సీ (అభయారణ్య)ప్రాంతాల్లో గిరిజనేతరులు ఇష్టారీతిన నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. ప్రధానంగా ఇంద్రవెల్లి, ఉట్నూరు ప్రాంతాల్లో విచ్చలవిడిగా దందా సాగుతోంది. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి అవసరాలకు అధిక వడ్డీలకు డబ్బులను రుణంగా అందజేసి.. వారు తీర్చలేని పరిస్థితుల్లో ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతోపాటు, వారి స్థలాల్లో భారీ భవంతుల నిర్మాణాలు చేపడుతున్నారు.

**ఇళ్లకు రైతుబంధు డబ్బులు..**వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మడంతో.. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు భవనాలను నిర్మించుకుంటున్నారు. వీటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. రెవెన్యూ రికార్డులో సర్వే నెంబరులో రైతుల పేరిట నమోదై ఉండటంతో యథావిధిగా రైతు బంధు డబ్బులను తీసుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల అనుమతి లేకుండా రెండు, మూడు అంతస్తుల భవనాల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారు.

**నాలా చట్టానికి తూట్లు**

వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడానికి నాలా(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్) చట్టం ప్రకారం గతంలో భూమి విలువలో 9 శాతం ఉండగా, తెలంగాణ ప్రభుత్వం ఇటీవల దీనిని కేవలం మూడు శాతం చెల్లించేలా సడలింపునిచ్చింది. అయినా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ పన్ను చెల్లించడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వం రూ.లక్షల్లో ఆదాయాన్ని నష్టపోతోంది.

**యథేచ్ఛగా స్థిరాస్తి వ్యాపారం**



చిత్రంలో కనిపిస్తున్న భూమి గత ఖరీఫ్ సీజన్ వరకు వ్యవసాయ భూమి. ఇంద్రవెల్లి మండలం నుంచి హర్కపూర్‌కు వెళ్తున్న మార్గంలో రహదారికి కుడి పక్కన ఉన్న భూమిని ప్రస్తుతం ప్లాట్లుగా మార్చేశారు. గిరిజనేతరులు కొందరు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వాటిని విక్రయిస్తున్నారు. గిరిజనుల భూములను కూడా వారు వేలాది ప్లాట్లను తయారు చేసి అందినకాడికి దండుకుంటున్నారు. ఈ రహదారికి అరకిలోమీటరు దూరంలో కైలాస్‌నగర్ గ్రామం వద్ద రహదారికి ఇరువైపులా ప్లాట్లు వేసి అమ్మేశారు. ఉట్నూరు మండలం ఎందా గ్రామ శివారులో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఎడమ వైపు వ్యవసాయ పొలంలో ప్లాట్లుగా మార్చి అమ్ముతున్నారు. ఇక్కడ ఒక ప్లాట్ ధర రూ.16 లక్షలకు పైగానే అమ్ముతున్నారని ప్రచారం జరుగుతోంది.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం- ముంజం సోము, తహసీల్దార్ ఇంద్రవెల్లి**

ప్రభుత్వ అనుమతి లేకుండా పంట పొలాల్లో ప్లాట్లు వేసి విక్రయించడం చట్టరీత్యా నేరం. పంట చేలో ప్లాట్లు వేసి అమ్మిన వాటికి రైతు బంధు పథకం తీసుకునే రైతుల వివరాలను సేకరించి వారిపై చట్టం ప్రకారంగా చర్యలు తీసుకుంటాం.




## ఎన్నికల్లో తాయిలాలపై కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు వరాలు ప్రకటిస్తుంటాయి. ఇదొక రివాజుగా మారడంతో ఓటర్లకు తాయిలాలపై సుప్రీంకోర్టులో శుక్రవారంనాడు కీలక పరిణామం చేటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల మందు పన్ను చెల్లింపుదారుల సొమ్ములతో ఉచితాలను పంచిపెడుతుండటంపై దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై సమాధానం కోరుతూ కేంద్రం, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలతో పాటు భారత ఎన్నికల సంఘం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు పంపింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు పన్ను చెల్లింపుదారుల సొమ్ములను దుర్వినియోగం చేస్తున్నాయంటూ 'పిల్' ఆరోపించింది. దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మానసం విచారణ చేపట్టింది. "ఎన్నికలకు ముందు ప్రభుత్వం డబ్బులు పంచడం కంటే ఆరాచకం మరొకటి లేదు. ఇది ప్రతిసారి జరుగుతోంది. అంతిమంగా పన్నుచెల్లింపుదారులపై ఆ భారం పడుతోంది" అని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టులో తన వాదన వినిపించారు. దీంతో ధర్మాసనం నోటీసులు జారీ చేస్తూ, నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, ఈసీఐని ఆదేశించింది. భట్టూలాల్ జైన్ అనే వ్యక్తి ఈ ప్రజాప్రయోజనాల వ్యాజ్యం వేశారు.

## రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలు గణనీయంగా తగ్గుముఖం

### వామపక్ష తీవ్రవాద నిర్మూలనపై సమీక్ష సమావేశంలో సీఎం వైయస్ జగన్



న్యూఢిల్లీ: మా ప్రభుత్వ వ్యూహాల వల్ల రాష్ట్రంలో ఎల్‌డబ్ల్యూఎఫ్ హింసాత్మక సంఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో నిర్వహించిన వామపక్ష తీవ్రవాద నిర్మూలన సదస్సులో సీఎం వైయస్ జగన్ పాల్గొన్నారు.

**సమావేశంలో సీఎం వైయస్ జగన్ ఏమన్నారంటే..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గడిచిన నాలుగు దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాద సమస్యపై పోరాడుతోంది. ఈ ప్రాంతాల్లో జాతీయ విధానం మరియు కార్యాచరణ ప్రణాళిక ప్రకారం.. తీసుకున్న చర్యలు, అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు మరియు స్థానిక ప్రజల హక్కుల పరిరక్షణ వంటి బహుముఖ విధానం– సానుకూల ఫలితాలను అందించింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ మద్దతుతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద సమస్యను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని చర్యలనూ తీసుకుంటోంది. మా ప్రభుత్వం అనుసరించిన వ్యూహాల వల్ల రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద హింసాత్మక సంఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. మొదట్లో ఆంధ్రప్రదేశ్‌లోని 5 జిల్లాల్లో విస్తరించిన మావోయిస్టు కార్యకలాపాలు ఇప్పుడు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయ్యాయి. ప్రభుత్వం తీసుకున్న చురుకైన చర్యల కారణంగా... మావోయిస్టు తీవ్రవాదబలం 2019 నుంచి 2023 నాటికి 150 నుంచి 50 కి తగ్గింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తన సరిహద్దులను ఒడిశా, తెలంగాణా మరియు చత్తీస్‌ఘడ్‌లతో పంచుకుంటుంది. పొరుగు రాష్ట్రాలతో పటిష్టమైన సమన్వయం ఉంది. నాలుగు రాష్ట్రాల అధికారులతో కూడిన జాయింట్ టాస్క్‌ఫోర్స్‌లు ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగింది. వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలను ఎదుర్కోవడానికి మాకున్న సమాచారాలను ఈ ఉమ్మడి టాస్క్‌ఫోర్స్ ద్వారా పరస్పరం పంచుకుంటూ... సమిష్టిగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నాం. స్థిరమైన అభివృద్ధి మరియు సామాజిక, ఆర్థిక పురోగతి మాత్రమే తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కీలక పరిష్కారాలు అని నేను ధృఢంగా విశ్వసిస్తున్నాను.

## చంద్రబాబు, పవన్‌పై కొడాలి నాని సంచలన వ్యాఖ్యలు



కృష్ణా జిల్లా: తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై మాజీ మంత్రి కొడాలి నాని సంచలన వ్యాఖ్యలు చేశారు.

శుక్రవారం ఆయన గుడివాడలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు కోటలో ఉన్నా ఒకటే.. పేటలో ఉన్నా ఒకటేనని అన్నారు. పవన్ కళ్యాణ్ ఉద్దేశించి మాట్లాడుతూ.. కరిచే కుక్క మొరగదని.. మొరిగే కుక్క అరవదని అన్నారు. పవన్ రూపాయి.. పావలా అని అంటున్నారని.. అంటే వైసీపీకి 125 సీట్లు వస్తాయని.. పావలా కళ్యాణ్‌కు వారి వుమ్మడి కూటమికి 25 సీట్లు వస్తాయని అర్ధం వచ్చినట్లు ఆయనే మాట్లాడుతున్నారని అన్నారు. పావలా కళ్యాణ్‌కు 25... రూపాయి పావలా పార్టీ అన్న పార్టీకి 125 అని పవన్ మనసులో అర్ధం అనుకుంటా.. అంటూ కొడాలి నాని పేర్కొన్నారు.

## రూ.3,300కోట్లు అవినీతి అని.. చివరకు పార్టీ ఫండ్‌ను కూడా వదట్లేదు..



అమరావతి: పార్టీ జాతీయ కార్యాలయంలో "స్కిల్‌పై నిందలు వేయడమంటే, యువత భవితపై దాడి చేయడమే" అనే పుస్తకాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, టీడీపీ నేతలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించిన పూర్తి వాస్తవాల ప్రతిరూపమే ఈ పుస్తకమన్నారు. త్వరలోనే ఫైబర్ నెట్ ప్రాజెక్ట్.. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ వ్యవహారాలను కూడా పూర్తి వాస్తవాలతో పుస్తక రూపంలో ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు. రూ.3,300 కోట్ల అవినీతి అని విషప్రచారం చేసి, చివరకు రూ.27కోట్ల పార్టీ ఫండ్‌ను అవినీతి సొమ్ముగా భూతద్దంలో చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి వచ్చిన విరాళాల్ని అవినీతి సొమ్ముగా చూపడం ఈ ముఖ్యమంత్రి, అతని మోచేతి నీళు తాగే వ్యవస్థల మతిలేనితనానికి నిదర్శనమన్నారు. తెలుగుదేశం పార్టీకి ప్రజలు, కార్యకర్తలు ఇచ్చిన నిధులకు.. జగన్ సర్కార్ చెబుతున్న అవినీతికి సంబంధమేంటని ప్రశ్నించారు. అసలు అవినీతి సొమ్ము అంటే జగన్ రెడ్డి ఖాతాలకో.. అతని కంపెనీలకో.. అతని భార్య ఖాతాకో వచ్చినట్టు వచ్చే సొమ్ము అని అన్నారు. చంద్రబాబుని అన్యాయంగా జైలుకు పంపి 28 రోజులవుతున్నా.. ఈ ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు, సాక్ష్యాలు బయటపెట్టలేక చివరకు పార్టీకి వచ్చిన నిధులపై పడిందని వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, వైసీపీ నేతలు పిచ్చివాగుడు వాగుతున్నారు తప్ప వాస్తవాలు తెలుసుకోవడంలేదని అచ్చెన్నాయుడు విమర్శలు గుప్పించారు.

## స్కిల్ స్కాం సూత్రధారి, లబ్ధిదారు చంద్రబాబే: మంత్రి కారుమూరి




తాడేపల్లి: చంద్రబాబు అవినీతిపరుడు కాబట్టే ఎవరూ మద్దతివ్వడంలేదని మంత్రి కారుమూరి అన్నారు. చంద్రబాబు ప్రజల వద్దకు యాక్టర్లను పంపిస్తున్నారు కానీ.. ముఖ్యమంత్రి జగన్ ప్రజల వద్దకు డాక్టర్లను పంపిస్తున్నారని చెప్పారు. ఎన్నో కేసుల్లో చంద్రబాబు న్యాయస్థానాల్లో స్టే తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఇవాల్టికి చంద్రబాబు పాపం పండింది కాబట్టే జైలు పాలయ్యారని అన్నారు. స్కిల్ స్కాం సూత్రధారి, లబ్ధిదారు చంద్రబాబేనని చెప్పారు. కేసుల నుంచి బయటపడటానికి చంద్రబాబు కోట్ల రూపాయలు వెచ్చించి సీనియర్ న్యాయవాదులను పెట్టుకున్నారని మంత్రి కారుమూరి చెప్పారు. బాబు తప్పు చేశారు కాబట్టే ఆయనకు అనుకూలంగా తీర్పు రావడం లేదని స్పష్టం చేశారు. బాబు పాలనలో ప్రజలను దోచుకుతిన్నారని మండిపడ్డారు. ఇవాళ ప్రజలందరికీ ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని అన్నారు. చంద్రబాబు అవినీతిని ఎండకడతానన్న పవన్ టిడిపితోనే కుమ్మక్కయ్యారని మంత్రి కారుమూరి అన్నారు. తడాకా చూపిస్తానని చెప్పి బాబు పంచన చేరారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు చెప్పడానికి పవన్‌కు ఏమీ లేదని దుయ్యబట్టారు.

## చీకటిని తరిమికొట్టే క్రాంతి మొదలైందని వారికి తెలీదు: నారా బ్రాహ్మణి ట్వీట్




అమరావతి: చంద్రబాబు అనే చైతన్యాన్ని నిర్బంధించి తిరుగులేదని కొందరు అనుకుంటున్నారని.. కానీ రాష్ట్రంలో చీకటిని తరిమికొట్టే క్రాంతి మొదలైందని వారికి తెలీదని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి అన్నారు. చంద్రబాబు అరెస్ట్ తదనంతర పరిణామాల నేపథ్యంలో 'కాంతితో క్రాంతి' నిరసన కార్యక్రమానికి ఆ పార్టీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై బ్రాహ్మణి ట్వీట్ చేశారు.

"మన రాష్ట్రాన్ని, మన భవిష్యత్తును చీకటి చేసి.. దాన్ని కనిపెట్టకుండా మనల్ని కళ్లు మూసుకో అంటున్నారు కొందరు. చంద్రబాబు అనే చైతన్యాన్ని నిర్బంధించి తిరుగులేదు అనుకుంటున్నారు. కానీ రాష్ట్రంలో చీకటిని తరిమికొట్టే క్రాంతి మొదలైందని వాళ్లకు తెలీదు. మనమెందుకు చీకట్లో ఉండాలి? అక్టోబర్ 7న రాత్రి 7 గంటలకు ఇళ్లలో లైట్లు ఆఫ్ చేసి బయటకు వచ్చి 5 నిమిషాల పాటు దీపాలు, సెల్‌ఫోన్ టార్చ్, కొవ్వొత్తులు వెలిగిద్దాం. రోడ్డుపై ఉంటే వాహనాల లైట్లు బ్లింక్ చేద్దాం" అని బ్రాహ్మణి పేర్కొన్నారు.

## 'కాంతితో క్రాంతి' కార్యక్రమాన్ని ప్రకటించిన నారా లోకేష్..

ప్రగతి వెలుగులు పంచే చంద్రుడుని ఫ్యాక్షన్ పాలకులు చీకట్లో నిర్బంధించారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు.

7వ తేదీ శనివారం రాత్రి 7.00 గంటల నుంచి 7.05 నిమిషాల వరకూ ఇళ్లలో లైట్లు ఆపి.. దీపాలు, కొవ్వొత్తులు, మొబైల్ టార్చ్ లైట్ వెలిగించి.. వాహనాల లైట్లు బ్లింక్ చేయడం ద్వారా దార్శనికుడు చంద్రబాబుకి సంఘీభావం తెలపాలని నారా లోకేష్ పిలుపునిచ్చారు. 'కాంతితో క్రాంతి' పేరిట కార్యక్రమం నిర్వహిద్దామని పేర్కొన్నారు. 'బాబుతో నేను' అంటూ వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయాలన్నారు. వాకిళ్లు, బాల్కనీలు, వీధుల్లోకి వచ్చి దీపాలు, కొవ్వొత్తులు, మొబైల్ టార్చ్‌లు, టార్చ్ లైట్లు.. వీటిలో వేటినైనా తీసుకుని వెలుగు చూపించాలని నారా లోకేష్ అన్నారు.




## నాసిరకం నిర్మాణంతోనే డ్యామ్ కొట్టుకుపోయింది..!

నాసి రకం నిర్మాణం కారణంగా సిక్కింలోని చుంగుతాంగ్ డ్యామ్ కొట్టుకుపోయిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ వెల్లడించారు. దీనికి తోడు బుధవారం ఒక్కసారిగా కుంభవృష్టి కురవడంతో లోనాక్ సరస్సులో నీటిమట్టం భారీగా పెరిగిపోయింది. దీంతో వరద మొత్తం చుంగుతాంగ్ డ్యామ్ వైపు మళ్లింది. ఈ కారణంగా డ్యామ్ తెగి దిగువ ప్రాంతాలపైకి వరద పోటెత్తింది. "డ్యామ్ నిర్మాణం సరైన పద్ధతిలో జరగలేదు. ఫలితంగా ఇది కొట్టుకుపోయింది. రాష్ట్రం ఉత్తరభాగంతో మిగిలిన ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి" అని ముఖ్యమంత్రి తమాంగ్ వెల్లడించారు. ఈ వరదల్లో ఎన్‌హెచ్–10 జాతీయ రహదారి పలు ప్రాంతాల్లో దారుణంగా దెబ్బతింది. ఉత్తర సిక్కింలోని లోనాక్ సరస్సు సైజు గత 30 ఏళ్లలో మూడు రెట్లు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 1990లో ఇది 0.42 చదరపు కిలోమీటర్లు ఉండేది. 2019 నాటికి ఇది 1.35 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. దీనిలో 6.5 కోట్ల క్యూబిక్ అడుగుల నీరు నిల్వ ఉంది. ఇది ఎప్పుడో పెను వరదలకు కారణం అవుతుందని 2021లో బెంగళూరు ఐఐఎంకు చెందిన ఓ రీసెర్చర్ హెచ్చరించారు.

**మొత్తం నీరు లీకై ఉంటే.. ఊహించనంత ప్రాణనష్టం..! :** తాజాగా చుంగుతాంగ్ డ్యామ్‌కు గండి పడిన సమయంలో లోనాక్ సరస్సు నుంచి పూర్తి నీరు డ్యామ్‌లోకి చేరలేదు. ఈ సరస్సులో ఇంకా నీరు ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాలు చెబుతున్నాయి. ఈ నీరు కూడా డ్యామ్‌లోకి చేరితే పెనువిపత్తు చోటు చేసుకునేదని నిపుణులు చెబుతున్నారు. సిక్కింలో ఇలాంటి సరస్సులు మొత్తం 14 వరకు ఉన్నాయి. వీటిల్లో కుంభవృష్టిలు, భారీ మంచు పెళ్లలు విరిగిపడినా.. ఇవి గట్లు తెంచుకొని ఊళ్లపై పడతాయి. లోనాక్ సరస్సు ప్రదేశం సెస్మిక్ జోన్‌లో ఉండటంతో భూకంపాల కారణంగా ఇది లీకయ్యే ప్రమాదం ఉంది. ఈ సరస్సుల సమీపంలో హైడ్రోపవర్ డ్యామ్‌లు భారీగా నిర్మించడం కూడా ప్రమాదకరంగా మారిందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. తాజాగా గ్లేషియర్ల వద్ద దాదాపు 650 హైడ్రో పవర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి.

## పోలవరం, విశాఖ ఉక్కు పరిశ్రీమను చౌకగా అప్పచెప్పేందుకు మోదీ యత్నం



కడప: విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కుపరిశ్రమ స్థాపించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ ఉక్కు పరిశ్రమను తనకు నచ్చిన వ్యక్తులకు చౌకగా అప్పజెప్పేందుకు ప్రధాని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దేశంలో పరిస్థితులు ఆందోళన కారణంగా ఉన్నాయన్నారు. ఢిల్లీలో పత్రికలపై దాడులు, సీబీఐ లాంటి వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. బ్యాక్ డోర్ విధానంతో కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల సంఘాలను ప్రమాదంలో నెడుతున్నారన్నారు. న్యాయవ్యవస్థను కూడా తప్పు దారి పట్టిస్తున్నారని విమర్శించారు. పోలవరం కోసం ఆరు వేలకోట్లు ఖర్చుచేశారన్నారు. పదేళ్లు అయినా ప్రభుత్వాలు పూర్తి చేయలేదని పల్లంరాజు విమర్శలు గుప్పించారు.




అహ్మదాబాద్: వన్డే ప్రపంచకప్ ప్రారంభమైంది. అయితే.. చిరకాల ప్రత్యర్థుల మధ్య మ్యాచ్‌ను చూసేందుకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అక్టోబరు 14న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్–పాకిస్థాన్‌లు తలపడనున్నాయి. దాయాది దేశాల మధ్య పోరును ప్రత్యక్షంగా వీక్షించేందుకు భారీ సంఖ్యలో అభిమానులు అహ్మదాబాద్‌కు రానున్నారు. ఈ క్రమంలో అక్కడి హోటళ్లకు డిమాండ్ పెరిగింది. మరోవైపు మ్యాచ్ జరిగే రోజు వివిధ నగరాల నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లే విమాన టికెట్ ధరలు సైతం ఆకాశాన్నంటుతున్నాయి. ఈ క్రమంలోనే క్రికెట్ అభిమానులకు భారతీయ రైల్వే శుభవార్త చెప్పింది. భారత్–పాక్ మ్యాచ్ జరిగే రోజున మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రల నుంచి అహ్మదాబాద్‌కు ప్రత్యేక వందే భారత్ రైళ్లను నడపనున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. త్వరలోనే రైళ్ల షెడ్యూల్, టికెట్ ధరల వివరాలు వెల్లడిస్తామన్నారు. భారత్–పాక్ మ్యాచ్ సందర్భంగా అహ్మదాబాద్‌లోని హోటళ్ల ధరలు భారీగా పెరగడం, అధిక విమాన టికెట్ ధరలు వంటి వాటి నుంచి ఉపశమనం కలిగించేందుకు వందే భారత్ ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించినట్లు రైల్వే ఉన్నతాధికారి ఒకరు జాతీయ వార్త సంస్థకు వెల్లడించారు. మ్యాచ్ ప్రారంభం కావడానికి కొన్నిగంటల ముందు ఈ ప్రత్యేక రైళ్లు సబర్మతీ, అహ్మదాబాద్ స్టేషన్లకు చేరుకుంటాయని తెలిపారు. ఈ రెండు స్టేషన్లు నరేంద్ర మోదీ స్టేడియానికి దగ్గరగా ఉండటంతో అభిమానులు సులభంగా స్టేడియానికి చేరుకోవచ్చన్నారు. అదేవిధంగా మ్యాచ్ ముగిసిన కొద్ది గంటల తర్వాత ఈ రైళ్లు అహ్మదాబాద్ నుంచి తిరిగి బయల్దేరుతాయని, దాని వల్ల అభిమానులు అదే రోజు తిరిగి తమ స్వస్థలాలకు చేరుకోవచ్చని తెలిపారు.

## తడిసిన చీరలో తాప్సి గ్లామర్ షాక్

బ్యూటిఫుల్ హీరోయిన్ గా చాలా కాలం పాటు తెలుగు ఇండస్ట్రీలో కొనసాగిన తాప్సీ పన్ను స్టార్ హీరోయిన్గా మాత్రం అంతకుమించి ఛాన్సులు అందుకోలేకపోయింది. కానీ ఎప్పుడైతే ఆమె బాలీవుడ్ కి వెళ్ళిపోయిందో అక్కడ మాత్రం చాలా మంచి ఆఫర్లు వచ్చాయి. కేవలం కమర్షియల్ సినిమాలు మాత్రమే కాకుండా పింక్ లాంటి మంచి కంటెంట్ ఉన్న సినిమాలలో కూడా అవకాశాలు అందుకుంది. సినిమాకు అవసరమైతే బికినీలో కూడా దర్శనమిచ్చి మోక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ ను కూడా అందించింది. ఇక బాలీవుడ్ లో అలా కొనసాగుతూ వెళుతున్న తాప్సి అప్పుడప్పుడు సోషల్ మీడియాలో కూడా గ్లామర్ తో హీటెక్కిస్తోంది. రీసెంట్గా మరోసారి అమ్మడు తడిసిన పరువాలతో మంత్రముగ్ధులను చేసింది. స్విమ్మింగ్ పూల్ లో చీరలో చీర కొంగును తడిపేసిన అమ్మడు అందులోనే



నడుము అందాలను కూడా మరింత అందంగా ప్రజెంట్ చేసింది. ఇక తన మత్తెక్కించే లుక్స్ తో కూడా ఈ భామ ఫాలోవర్స్ కు మతిపోయేలా చేసింది. గతంలో ఇంతకంటే ఘాటైన లుక్స్ లో కూడా కనిపించిన తాప్సి ఇప్పుడు మాత్రం అంతకుమించి అనేలా అందంగా ఉంది అంటూ పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంటుంది. సినిమాల అవకాశాలు వస్తున్నా రాకపోయినా కూడా ఈ బ్యూటీ మాత్రం సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను ఎప్పటికప్పుడు తన గ్లామర్ తో అట్రాక్ట్ చేస్తూనే ఉంది. ఇక తెలుగులో తాప్సి సినిమా అవకాశాలు అందుకుని చాలా కాలమే అయింది. తెలుగులో కావాలని చేయడం లేదా అనే కామెంట్స్ కూడా ఆమె చాలా సున్నితంగా సమాధానాలు ఇచ్చింది. ఇక్కడ నటించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదు అని మంచి కంటెంట్ ఉన్న కథలు వస్తే చేయడానికి ఎప్పుడు సిద్ధమే అని వివరణ ఇచ్చింది. ఇక తాప్సి బాలీవుడ్ లో తక్కువ బడ్జెట్ సినిమాలలో కూడా రెమ్యునరేషన్ తక్కువగా తీసుకుని మరి నటిస్తోంది. వీలైనంతవరకు నటిగా తనను తాను కొత్తగా ప్రజెంట్ చేసుకునేందుకు ప్రయత్నాలు అయితే చేస్తుంది. కానీ గత కొంతకాలంగా మాత్రం అమ్మడికి సరైన విజయాలు బాలీవుడ్ లో కూడా దక్కడం లేదు. ప్రస్తుతమైతే చేతిలో డంకీ సినిమా ఉంది. రాజ్ కుమార్ హీరోని షారుక్ ఖాన్ కాంబినేషన్లో వస్తున్న ఈ సినిమాలో అమ్మడు ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించబోతోంది. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి.

## యంగ్ డైరెక్టర్ తో వామికా గబ్బి..జీవితానికిది చాలు!

ఇండస్ట్రీకొచ్చిన ప్రతీ హీరోయిన్ కి ఓ డ్రీమ్ రోల్ అంటూ ఒకటుంటుంది. ఫలానా పాత్రలో నటించాలని పరిశ్రమకి రాక ముందునుంచే కలలు కంటుంటారు. అందుకు కొంత మంది నటీమణుల్ని స్ఫూర్తిగా తీసుకుంటారు. అయితే డ్రీమ్ రోల్ రావడం అన్నది అంత సులభంగా జరిగే పనికాదు. అలాంటి పాత్రలు అందుపుచ్చుకోవడానికి చాలా సమయం పడుతుంది. అందుకు ట్యాలెంట్ తో పాటు టైమ్...లుక్ అన్నీ కలిసి రావాలి. అలాగైతేనే సాధ్యమవుతుంది. తాజాగా యువ నాయిక వామిక గబ్బీ ఆ కోటాకి చెందిన భామగా చెప్పుకుంటుంది. 'జూబిలి'..'గ్రహన్' లాంటి వెబ్ సిరీస్ లతో వామిక ప్రేక్షకుల్ని మెప్పించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ భామ యువ సంచలనం అట్లీ సినిమాలో అవకాశం దక్కించుకుంది.



ఇప్పుడీ అవకాశాన్ని తన డ్రీమ్ రోల్ గా ప్రచారం చేసుకుంటోంది. అట్లీ బ్రాండ్ తో అమ్మడు తనని తాను వ్యక్తిగతంగా ప్రమోట్ చేసుకుంటుంది. అట్లీ లాంటి స్టార్ డైరెక్టర్ తో పనిచేయడం కన్నా నాలాంటి వాళ్లకు అంతకు మించిన డ్రీమ్ రోల్ ఎక్కడ దొరుకుతుందని సంతోషం వ్యక్తం చేసింది. అలాగని అట్లీ ఈ సినిమాకి దర్శకుడు కాదండోయ్. ఆయన కేవలం నిర్మాత మాత్రమే. ఈ సినిమాకి దర్శకత్వం వహించేది కలీస్. ఆయన చెప్పిన కథ నచ్చడంతో అట్లీ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా వామికా గబ్బీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'అట్లీ గొప్ప దర్శకుడు.. యాక్షన్.. ఎమోషన్ కలిపి అద్భుతాలు చేయగల గ్రేట్ మేకర్. అలాంటి వ్యక్తితో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది. పైగా ఇందులో నేనెంతో ఇష్టపడే పాత్ర కూడా దక్కింది. ఇది పెద్ద కమర్శియల్ చిత్రం. ఇలాంటి ఓ సినిమా నా జీవితంలో ఉంటుందని ఊహించలేదు. నేను అనుకోకుండా నా దగ్గరకు ఊహించని ప్రాజెక్ట్ వచ్చినప్పుడు దాన్ని నేను డ్రీమ్ రోల్ గానే భావిస్తాను. ఓ పాత్రలో నటించే అవకాశం కల్పించారు అంటే ఆ పాత్రకు మనం సూటవుతున్నామని..న్యాయం చేస్తామనే నమ్మకంతోనే ఛాన్స్ ఇస్తారు. అట్లీ అండ్ కోకి నాపై ఆ నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు' అని అంది.




# ఆ సినిమాలకి ఎన్నికల ఝలక్?




ఈ ఏడాది డిసెంబర్ లో టాలీవుడ్ నుంచి చాలా సినిమాలు రిలీజ్ కి రెడీ అవుతున్నాయి. డిసెంబర్ 1 నుంచి మొదలుపెడితే 22 వరకు సినిమాల సందడి ఉంది. వీటిలో మినిమం రేంజ్ మూవీస్ నుంచి పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ వరకు ఉన్నాయి. డిసెంబర్ 1న రణబీర్ కపూర్ హీరోగా తెరకెక్కుతోన్న యానిమల్ మూవీ పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ కి సిద్ధమవుతోంది. అయితే డిసెంబర్ నెలలో సినిమాలకి ఎన్నికల టెన్సన్ మొదలైంది. తెలంగాణలో ఈ ఏడాది డిసెంబర్ లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. ఏపీలో షెడ్యూల్ ప్రకారం ఎలక్షన్స్ జరిగితే ఏప్రిల్ తర్వాత ఉంటాయి. కాని తెలంగాణలో మాత్రం ఈ ఏడాదిలోనే నిర్వహించాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఒకే ఎన్నికల విధానం తీసుకొస్తే ఎప్పుడు జరుగుతాయనేది చెప్పలేం. అయితే ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం అయితే తెలంగాణలో డిసెంబర్ నెలలోనే ఎన్నికలు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. మొదటి, రెండు వారాల్లోనే ఈ ఎన్నికల వేడి ఉంటుందని భావిస్తున్నారు. అదే జరిగితే ఎట్టి పరిస్థితిలో కూడా సినిమాలు రిలీజ్ చేయలేని పరిస్థితి ఉంటుంది. పబ్లిక్ మూడ్ అంతా ఎలక్షన్స్ వైపు వెళ్ళిపోతుంది. సినిమాలు చూడటానికి ఎవరూ ఆసక్తి చూపించరు. ఈ కారణంగా నేచురల్ స్టార్ నాని హాయ్ నాన్న, విక్టరీ వెంకటేష్ సైంధవ్, నితిన్ ఎక్స్ట్రార్డినరీ సినిమా కూడా రిలీజ్ కోసం వెయిట్ చేస్తున్నాయి. ఒకవేళ ఎన్నికలు జరగకుంటే డిసెంబర్ లో సినిమాలని ప్రేక్షకుల ముందుకి తీసుకురావడానికి సిద్ధం అవుతున్నారు. ఒకవేళ ఎన్నికలు జరిగితే మాత్రం డిసెంబర్ ఆఖరులో లేదంటే ఫిబ్రవరిలో సరైన డేట్ చూసుకొని రిలీజ్ చేయాలని అనుకుంటున్నారంట. ఎన్నికల షెడ్యూల్ ఎనౌన్స్ చేసేంత వరకు రిలీజ్ పై ఎలాంటి ప్రకటన చేయకుండా ఉండటం బెటర్ అనే ఉద్దేశ్యంతో ఈ సినిమాల నిర్మాతలు ఉన్నారని ఫిల్మ్ నగర్ సర్కిల్ లో వినిపిస్తోంది అయితే డిసెంబర్ ఎన్నికలు కన్ఫర్మ్ అయితే మాత్రం కేవలం ఈ మూడు చిత్రాలకి మాత్రమే కాకుండా చాలా సినిమాలపై ప్రభావం ఉంటుందని చెప్పొచ్చు.

# అందరూ ఆ డేట్ కోసమే ఎగబడితే ఎలా?




డిసెంబర్ నెలలో చాలా సినిమాలు ప్రేక్షకుల ముందుకి రావడానికి సిద్ధమవుతున్నాయి. మినిమమ్ రేంజ్ మూవీస్ నుంచి పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ వరకు థియేటర్స్ లోకి రాబోతున్నాయి. డిసెంబర్ 1న యానిమల్ సినిమాతో ఆ నెలలో సినిమాల తాకిడీ మొదలు కాబోతోంది. తరువాత ప్రతి వారం మూవీస్ రిలీజ్ అవుతూనే ఉండటం విశేషం. అయితే డిసెంబర్ 8 మాత్రం చాలా ప్రత్యేకం అని చెప్పాలి. డిసెంబర్ 22న డార్లింగ్ ప్రభాస్ సలార్ మూవీ రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాకి ఎదురెళ్ళడం కష్టం అని టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు నిర్మాతలందరికీ తెలుసు. దర్శకులు కూడా సలార్ కి పోటీగా తమ సినిమాలు రిలీజ్ చేసే ధైర్యం చేయలేరు. అంతగా సలార్ మూవీ ఇంపాక్ట్ ఉంటుంది. ఆ ముందు వారం సినిమాలు రిలీజ్ చేసిన కచ్చితంగా మొదటి వారం తర్వాత సూపర్ హిట్ టాక్ వచ్చిన కలెక్షన్స్ కచ్చితంగా డ్రాప్ అయిపోతాయి. అందుకే సేఫ్ జోన్ గా డిసెంబర్ 8న రిలీజ్ ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే ఈ డేట్ కోసం ఇప్పుడు కాంపిటేషన్ ఎక్కువైపోయింది. వరుణ్ తేజ్ తెలుగు, హిందీ భాషలలో చేస్తోన్న ఆపరేషన్ వాలంటైన్ మూవీ డిసెంబర్ 8న రిలీజ్ కానుంది. విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి కూడా అదే రోజు థియేటర్స్ లోకి రాబోతోంది. బాలీవుడ్ లో కరణ్ జోహార్ నిర్మాణంలో సిద్ధార్ద్ మల్హోత్రా చేస్తోన్న పాన్ ఇండియా మూవీ యోదాని డిసెంబర్ 15న రిలీజ్ చేద్దామని అనుకున్న ఒక వారం ముందుకి తీసుకొస్తున్నారు. విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ లీడ్ రోల్ లో శ్రీరామ్ రాఘవన్ తెరకెక్కిస్తున్న మేరీ క్రిస్మస్ మూవీని కూడా డిసెంబర్ 8కి రిలీజ్ చేయాలని భావిస్తున్నారు. వీటితో పాటుగా నేచురల్ స్టార్ నాని హాయ్ నాన్న మూవీని కూడా డిసెంబర్ 7, 8 తేదీలలో ఏదో ఒక రోజు కన్ఫర్మ్ చేయాలని అనుకుంటున్నారు. మొత్తానికి డిసెంబర్ 8కి అయితే సినిమాల మధ్య పోటీ గట్టిగానే ఉండబోతోంది. పాన్ ఇండియా కల్చర్ పెరిగిన తర్వాత అన్ని భాషల నుంచి సినిమాలు డబ్బింగ్ రూపంలో ఇతర భాషలలో కూడా రిలీజ్ అవుతున్నాయి. ఇది కూడా సినిమాల రిలీజ్ విషయంలో కాంపిటేషన్ పెరగడానికి ఒక కారణం అయ్యిందని చెప్పొచ్చు.

## చీర కట్టులో లేడీ విలన్ కవ్వింపులు

ఉత్తరాది బుల్లితెర ప్రేక్షకులను దాదాపు పదిహేనేళ్ల క్రితం నుంచి అలరిస్తున్న ముద్దుగుమ్మ మౌనీ రాయ్. నాగిని గా దేశం మొత్తం పాపులారిటీని సొంతం చేసుకున్న మౌనీ రాయ్ కి బాలీవుడ్ సినిమాల్లో వరుసగా ఆఫర్లు దక్కుతున్నాయి. ఈమె చేసిన బ్రహ్మాస్త్ర మూవీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ఆమె పాత్రకి మంచి పేరు కూడా దక్కిన విషయం తెల్సిందే. మౌనీ రాయ్ ప్రస్తుతం బాలీవుడ్ లో ఒక సినిమాలో నటిస్తోంది. రెండు మూడు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. సౌత్ లో కూడా ఈ అమ్మడికి మంచి డిమాండ్ ఉంది. కానీ ఇప్పటి వరకు సౌత్ సినిమాలకు ఓకే చెప్పడం



లేదు. ఇక ఈ అమ్మడు అందాల ఆరబోతతో సోషల్ మీడియాలో రెగ్యులర్ గా వైరల్ అవుతూనే ఉంటుంది. ఎక్కువగా స్కిన్ షో చేస్తూ కన్నుల విందు చేసే మౌనీ రాయ్ ఈసారి చీర కట్టుతో కవ్విస్తోంది. వైట్ కలర్ పై ఎల్లో కలర్ ఫ్లవర్స్ తో చీర చాలా ఆకర్షణీయంగా ఉంది. ఆ చీరను క్లీ వేజ్ షో చేస్తూ మౌనీ రాయ్ కట్టుకోవడం చూస్తే మరింత అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

ఈ లేడీ విలన్ ను చీర కట్టులో చూస్తూ ఉంటే చూపు తిప్ప లేక పోతున్నాం అంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం స్టార్ హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గకుండా అందంగా ఉన్నారు అంటూ మౌనీ రాయ్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ రేంజ్ లో అందాలను చూపిస్తే ముందు ముందు స్టార్ హీరోయిన్స్ కి పోటీగా మారడం ఖాయం అనిపిస్తోంది.

## ఈమె వయసు నిజంగా 51 అంటే నమ్ముతారా?

సౌత్ సినిమాలతో ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ టబు. సౌత్ నుండి నార్త్ కి వెళ్లి అక్కడ దాదాపు అందరు స్టార్ హీరోలతో సినిమాలు చేసి అరుదైన రికార్డ్ ని సొంతం చేసుకుంది. మూడు దశాబ్దాలుగా టబు సినిమాల్లో సందడి చేస్తూనే ఉంది. ఇప్పటి వరకు పెళ్లి చేసుకోలేదు, సినిమాలను కంటిన్యూ చేస్తూనే ఉంది.



హీరోయిన్ గా టబు ఇండస్ట్రీ లో అడుగు పెట్టి దాదాపుగా మూడు దశాబ్దాలు అవుతున్నా కూడా ఇంకా కూడా హీరోయిన్ పాత్రల్లో నటిస్తుంది అంటే కారణం ఈ అందం అనడంలో ఎలాంటి సందేహం లేదు. తాజాగా టబు తన అందంతో మరోసారి అందరికి షాక్ ఇచ్చింది. పాతికేళ్ల పడుచు అమ్మాయి మాదిరిగా టైట్ జీన్స్ ధరించి, సింపుల్ టాప్ లో స్కిన్ షో చేయకుండానే చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ ఫోటోని చూసిన ఎవరైనా ఈమె వయసు 51 అంటే నిజమా అంటూ నోరు వెళ్లబెట్టడం ఖాయం. ఈ రేంజ్ లో అందంగా ఉన్న టబు మరో పదేళ్లు అయినా కూడా మూడు పదుల వయసు ముద్దుగుమ్మ అన్నట్లుగానే అనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అయిదు పదుల వయసు లోనే పాతికేళ్ల పరువాలతో కనిపించే ముద్దుగుమ్మలు చాలా తక్కువ మంది ఉంటారు. అందుకే టబు అరుదైన పీస్ అంటూ ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.



# రాష్ట్రంలో సెమీ కండక్టర్ పరిశ్రమ.. రూ. 2,800 కోట్ల పెట్టుబడితో 2 వేల మందికి ఉపాధి

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. తాజాగా ప్రపంచ స్థాయి కంపెనీ కేయిన్స్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. కేయిన్స్ నిర్ణయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్వాగతించారు. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది కేయిన్స్ టెక్నాలజీ సంస్థ. రూ. 2,800 కోట్ల పెట్టుబడితో ఓసాట్, కాంపౌండ్ సెమీ కండక్టర్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఈ పరిశ్రమ ద్వారా 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సెమీ కండక్టర్ పరిశ్రమకు ఆతిథ్యం ఇచ్చే ప్రతిష్టాత్మక ప్రపంచ గమ్యస్థానాల లీగ్‌లో తెలంగాణ చేరినందుకు గర్వకారణంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో ఫ్యాక్స్ కాన్, కార్నింగ్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీం సూపర్.. అల్పాహారం రుచిగా ఉందన్న మంత్రి కేటీఆర్




హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందివ్వాలనే ఉద్దేశంతో శ్రీకారం చుట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీం సూపర్ అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. అల్పాహారం రుచిగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని వెస్ట్‌మారేడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మంత్రి టిఫిన్ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. రాష్ట్రంలోని 23 లక్షల మంది పిల్లలకు ప్రతి రోజు ఉదయం సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీం కింద అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 27,147 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మధ్యాహ్నం భోజనంలో భాగంగా ప్రతి విద్యార్థికి సన్నబియ్యంతో కూడిన భోజనాన్ని అందిస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. అదే విధంగా ఉదయం పూట కూడా నాణ్యమైన బ్రేక్ ఫాస్ట్ పెడితే బాగుంటుందని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో, మున్సిపాలిటీల్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో, గ్రామాల్లో పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా కలిసి బ్రేక్ ఫాస్ట్‌ను అందించనున్నాయి. బ్రేక్ ఫాస్ట్ పోషకాలతో కూడి ఉంది. చాలా రుచిగా ఉంది.. నేను కూడా తిన్నాను. మెనూ ప్రకారం అల్పాహారం అందివ్వకపోతే తమకు ఫోన్ చేయాలని విద్యార్థులకు కేటీఆర్ సూచించారు. నాణ్యతతో కూడిన అల్పాహారాన్ని అందివ్వాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కేటీఆర్ ఆదేశించారు. తరుచుగా బ్రేక్ ఫాస్ట్‌ను పరిశీలిస్తూ, రుచిని కూడా పరిశీలించాలన్నారు. మరో ఐదారు రోజుల్లో దసరా సెలవులు కూడా వస్తాయి. ఈ లోపు అల్పాహారం పథకం ఎలా ఉందనే ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని టీచర్లకు సూచించారు కేటీఆర్. పిల్లలందరూ మన పిల్లలే. ఎక్కడ ఒక చిన్న తప్పు జరిగినా అందరం బాధపడే పరిస్థితి ఉంటది కాబట్టి.. టీచర్లు కూడా మాకు చెప్పండి. ఈ పథకాన్ని ఎలా అభివృద్ధి చేయాలో కూడా చెప్పాలని కేటీఆర్ కోరారు. తమిళనాడులో ఈ కార్యక్రమాన్ని ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు అమలు చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. సీఎం కేసీఆర్ మాత్రం తెలంగాణలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు అమలు చేయాలని నిర్ణయించారు. ఎందుకంటే పనులకు వెళ్లే తల్లిదండ్రుల పిల్లలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. పోషకాలతో కూడి అల్పాహారం విద్యార్థులకు అందుతుంది. పిల్లల బ్రేక్ ఫాస్ట్ కోసం పొద్దున 5 గంటలకు లేవాల్సి ఉంటుంది. ఈ పథకం అమలుతో అటు తల్లిదండ్రులకు, ఇటు పిల్లలకు లాభం కలుగుతుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించిన మంత్రులు హరీశ్ రావు, సబిత



రంగారెడ్డి: ముఖ్యమంత్రి అల్పాహార పథకం రాష్ట్ర వ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లా రావిర్యాల జిల్లాపరిషత్ స్కూల్‌లో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. వారితో కలిసి టిఫిన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రంజిత్ రెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, సికింద్రాబాద్‌లోని వెస్ట్‌మారేడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో మంత్రి కేటీఆర్ ఈ కర్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల కలిసి టిఫిన్ చేసిన మంత్రి.. రుచి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇక రాష్ట్రంలోని నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ వల్ల రాష్ట్రంలోని 27,147 పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతి చదువుతున్న 23 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనున్నది. ప్రతిరోజు స్కూళ్ల ప్రారంభానికి అరగంట ముందు విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని పాఠశాలల్లో అక్షయపాత్ర సంస్థ ద్వారా, మిగిలిన జిల్లాల్లో మధ్యాహ్న భోజన కార్మికుల ద్వారా అల్పాహారాన్ని అందజేస్తారు.

**అల్పాహార మెనూ :** సోమవారం: ఇడ్లీ సాంబార్/ గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ, మంగళవారం: పూరి, ఆలు కుర్మా/ టమాటా బాత్, చట్నీ, బుధవారం: ఉప్మా,సాంబార్/ కిచిడీ, చట్నీ, గురువారం: మిల్లెట్ ఇడ్లీ, సాంబార్ / పొంగల్, సాంబార్, శుక్రవారం: ఉగ్గాని/ పోహా/మిల్లెట్ ఇడ్లీ, చట్నీ/ కిచిడీ, చట్నీ, శనివారం: పొంగల్, సాంబార్/ వెజ్ పలావ్, రైతా/ఆలు కుర్మా.

# ఆకలి బాధలు తీర్చేందుకే అల్పాహారం పథకం : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్ : విద్యార్థుల్లో ఆకలి బాధలు లేకుండా చేసి పిల్లలు పాఠశాలకు హాజరయ్యేలా చూడడంతో పాటు పోషకాహార స్థితిని మెరుగుపరచడం, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో సీఎం కేసీఆర్ పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్మల్ నియోజకవర్గం సోన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ముఖ్యమంత్రి ఆల్పాహారం పథకాన్ని ప్రారంభించి చిన్నారులకు అందించే అల్పాహారాన్ని దగ్గరుండి పరిశీలించారు. అనంతరం పిల్లలకు స్వయంగా బ్రేక్‌ఫాస్ట్ వడ్డించిన మంత్రి తాను కూడా చిన్నారులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మానవీయ కోణంలో పేద విద్యార్థులకు ప్రవేశపెట్టిందే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకమని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామని వెల్లడించారు. విద్యాశాఖపై ప్రత్యేక శ్రద్ధవహిస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దు.. రేవంత్ ఆర్ఎస్ఎస్ వ్యక్తి : అసదుద్దీన్ ఓవైసీ

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ రేవంత్.. ఆర్ఎస్ఎస్ వ్యక్తి అని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. తెలంగాణ ముస్లిం పట్ల కాంగ్రెస్ పార్టీకి విద్వేషం ఉన్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి.. గతంలో బీజేపీ నేత కిషన్ రెడ్డితో కలిసి పని చేసినట్లు ఆరోపించారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో ఉన్నాడని, ఆ తర్వాత ఆర్ఎస్ఎస్‌కు వెళ్లాడని, అక్కడ నుంచి బీజేపీలోకి వెళ్లినట్లు రేవంత్‌పై విమర్శలు చేశారు. బీజేపీ నుంచి చంద్రబాబును రేవంత్ ఆశ్రయించాడని ఓవైసీ గుర్తు చేశారు.

**కాంగ్రెస్ దారుణాలను ప్రత్యక్షంగా చూశాను..** కాంగ్రెస్ పార్టీని నమ్మవద్దు అని తమ పార్టీ కార్యకర్తలకు ఓవైసీ హితబోధ చేశారు. దేశంలో కాంగ్రెస్ ఎటువంటి దారణాలకు పాల్పడిందో తాను ప్రత్యక్షంగా చూసినట్లు చెప్పారు. రాజస్థాన్‌లో జునైద్‌ను సజీవంగా కాల్చి చంపారన్నారు. కానీ అతని కుటుంబాన్ని ఇంత వరకు ఆదుకోలేదన్నారు. తాము కర్నాటక నుంచి తెలంగాణకు వచ్చినట్లు కాంగ్రెస్ ఆరోపించిందని, కానీ తాము బాబా ఆజమ్ ఖాన్ వారసులమని ఓవైసీ స్పష్టం చేశారు.

**మూడోసారి అధికారంలోకి సీఎం కేసీఆర్..** తెలంగాణ సీఎం కేసీఆర్.. మూడవ సారి అధికారంలోకి వస్తారని ఎంపీ పేర్కొన్నారు. రాజకీయాల్లో ముస్లింల ప్రాతినిధ్యం లేకపోవడానికి కారణం నెహ్రూ, పటేల్ అని ఆరోపించారు. మనకు విచిత్రమైన ప్రధాని ఉన్నారని అన్నారు. కర్నాటకకు కేసీఆర్ పైసలు ఇచ్చినట్లు ప్రధాని ఆరోపించారన్నారు. ప్రధాని విద్వేషాలను పెంచుతున్నారని, ఇది 2014 నుంచి మరీ ఎక్కువైందన్నారు. బీజేపీలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే, ఒక్క ముస్లిం ఎంపీ లేరన్నారు, ముస్లిం మంత్రిలేరన్నారు. మౌనంగా కూర్చోవడానికి తాము రాలేదని, మౌనంగా ఉన్నవాళ్లు ఖతం అవుతారని, తాము పోరాడేందుకు వచ్చినట్లు ఓవైసీ చెప్పారు.




**రాష్ట్రంలో ఈ నెల 14, 15 తేదీల్లో బస్సు యాత్ర మొదలు పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తం అవుతోంది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు చేపడుతున్న బస్సు యాత్రను కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ ప్రారంభించనున్నారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో రాహుల్ గాంధీ బస్సు యాత్రలో పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి**

# కమిటీలు వర్కవుటవుతాయా ?




హైదరాబాద్ : తెలంగాణా బీజేపీ నేతలకు ఏం చేయాలో దిక్కుతోస్తున్నట్లు లేదు. అందుకనే షెడ్యూల్ ఎన్నికలు మరో రెండు నెలలుండగా ఇపుడు పార్టీకి సంబంధించిన 14 ఎన్నికల కమిటీలను వేశారు. ఈ 14 కమిటీలకు ఛైర్మన్లు, కన్వీనర్లతో పాటు జాయింగ్ కన్వీనర్లను నియమించింది. ఇంత సడెన్ గా కమిటీలను పార్టీ ఎందుకు వేసిందంటే అసంతృప్తులను బుజ్జగించటానికే అని అర్ధమైపోతోంది. పార్టీ అగ్రనేతల వ్యవహారం ఎలాగుందంటే చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లుగా ఉంది. పార్టీ నేతల మధ్య ఆధిపత్య పోరు బహిరంగంగానే నడుస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇక్కడ సమస్య ఏమిటంటే పార్టీలో చేరటానికి ఇతర పార్టీల నుండి సీనియర్ నేతలు పెద్దగా ముందుకు రావడం లేదు. బయట పార్టీల నుండి బీజేపీలో చేరకపోగా పార్టీలో ఉన్న వాళ్ళే బయటకు వెళ్ళిపోవటానికి రెడీ అవుతున్నారనే ప్రచారం అందరికీ తెలిసిందే. కేంద్రమంత్రి, పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి వ్యవహారశైలిపై చాలామంది సీనియర్లు మండిపోతున్నారు. నిజానికి కిషన్ వచ్చిందే కొత్తగా. అయితే బండి సంజయ్ ని అధ్యక్షుడిగా నియమించటాన్ని జీర్ణించుకోలేకపోతున్న కొందరు సీనియర్లు ఆ కోపాన్ని కిషన్ పై చూపుతున్నారు. పార్టీ నాయకత్వంపై అనేక కారణాలతో అసంతృప్తిగా ఉన్న కొండా విశ్వేశ్వరరెడ్డి, వివేక్, కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి, విజయశాంతి, సోయం బాపూరావు, ఏనుగు రవీంద్రారెడ్డి, రమేష్ రాథోడ్ లాంటి వాళ్ళు తొందరలోనే పార్టీని వదిలేయబోతున్నట్లు బాగా ప్రచారం జరుగుతోంది. మేనిఫెస్టో, పబ్లిసిటి కమిటీ ఛైర్మన్ వివేక్, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి, పోరాటాల కమిటి ఛైర్ పర్సన్ గా విజయశాంతి, మేనిఫెస్టో కమిటీ మెంబర్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పార్టీలో ఉండేది అనుమానమే. అంటే ఇక్కడ సమస్య ఏమిటంటే పార్టీలో చెప్పుకోదగ్గ నేతలు ఎవరు చేరకపోగా అగ్రనేతలు తీసుకుంటున్న నిర్ణయాలతో పార్టీ గ్రాఫ్ పడిపోతోంది. ముఖ్యంగా బీజేపీ గ్రాఫ్ ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కీలక సూత్రధారి కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయకపోవటంతోనే పడిపోయిందని కమలనాదులు బహిరంగంగానే కామెంట్ చేస్తున్నారు. దీనివల్ల బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అని, నరేంద్రమోడీ–కేసీయార్ మధ్య లోపాయికారీ ఒప్పందం జరిగిందనే ప్రచారాన్ని జనాలు నమ్ముతున్నారు. అందుకనే గ్రాఫ్ పడిపోతోంది. ఈ కారణంగానే చాలామంది అసంతృప్తితో ఉన్నారు.

# ఖానాపూర్‌లో బీఆర్ఎస్ ఎలా గెలుస్తుందో చూస్తా




నిర్మల్: ఖానాపూర్‌లో బీఆర్ఎస్ ఎలా గెలుస్తుందో చూస్తానని ఎమ్మెల్యే రేఖానాయక్ శపథం చేశారు. ఖానాపూర్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కార్ తీరుపై మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కేటీఆర్ ఫ్రెండ్ కోసం తనకు టికెట్ ఇవ్వలేదని వాపోయారు. నేనేంటో వచ్చే ఎన్నికల్లో చూపిస్తానని హెచ్చరించారు. అయినా నేనేం తప్పు చేశానంటూ నిలదీశారు. ఏమైనా కుంభకోణాలు చేశానా? అని ప్రశ్నించారు. అభివృద్ధి పనులకు నిధులు కూడా ఇవ్వలేదని వాపోయారు. ఎస్టీ నియోజకవర్గంపై వివక్ష చూపారని రేఖానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా బీఆర్ఎస్‌లో మహిళలకు విలువ లేదని ఆమె కంటతడి పెట్టారు. ఒంటరిగా పోటీ చేసి బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతానన్నారు. ఖానాపూర్ అడ్డా.. రేఖానాయక్ అడ్డా అని వ్యాఖ్యానించారు. ఖానాపూర్‌లో మరో నేతను గెలవనివ్వకుండా చూస్తానని రేఖానాయక్ స్పష్టం చేశారు.

# కేసీఆర్ కుటుంబంతో తెలంగాణకు నయా పైసా మేలు జరగలేదు



హైదరాబాద్: కేసీఆర్ కుటుంబంతో తెలంగాణకు నయా పైసా మేలు జరగలేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆరోపించారు. శుక్రవారం నాడు బీజేపీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా అరవింద్ మీడియాతో మాట్లాడుతూ..“ పసుపు బోర్డు ఎలా పని చేస్తుందో రేవంత్‌రెడ్డికీ అవగాహన లేదు. మంత్రిగా పని చేసిన అనుభవం రేవంత్‌రెడ్డికి లేదు. రేవంత్ జీవితంలో మంత్రి కాలేరు. పసుపు బోర్డు ఎక్కడ పెట్టాలో మాకు తెలుసు.. రేవంత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ పార్టీ పసుపు పంటను నాశనం చేసింది. కాంగ్రెస్ పార్టీని రేవంత్ ఎప్పుడు వీడతారో తెలియదు. తెలంగాణ వీరుల పోరాటంతోనే సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది. రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ఓడిపోతేనే మల్కాజిగిరి నుంచి చివరి నిమిషంలో పోటీ చేశారు. సగం పార్లమెంట్ స్థానాలల్లో కాంగ్రెస్ అడ్రస్ లేదు.. కాంగ్రెస్‌కు ఇక అసెంబ్లీ 61 సీట్లు ఎక్కడి నుంచి వస్తాయి. అదానీని పైకి తీసుకు వచ్చిందే కాంగ్రెస్ పార్టీ. సోనియాగాంధీ కాదు స్కాంల గాంధీ. రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసు ఏమైందీ..? మంత్రి కేటీఆర్ మోదీని విమర్శిస్తే చూస్తు ఊరుకోం. కేంద్ర ప్రభుత్వం నిధుల వల్లే తెలంగాణ అభివృద్ధి చెందింది. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ రెండుసార్లు ప్రకటించిన మేనిఫెస్టోలోని ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. ఈ సారి ప్రకటించే బీఆర్ఎస్ మేనిఫెస్టోను చించివేయాలి” అని ఎంపీ అరవింద్ పిలుపునిచ్చారు.

# ప్రజలకు మేలు జరిగేలా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో



కరీంనగర్: ప్రజలకు మేలు జరిగేలా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడు కరీంనర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ విఫలం అయింది. తొలివిడతలో ఆరు గ్యారంటీలు ప్రకటించాం. ప్రజల నుంచి వారి అభిప్రాయాలను తీసుకుంటున్నాం. ఆర్థికవేత్తల సలహాలతో సూచనలతో గ్యారంటీలు రూపొందించాం. కర్ణాటకలో హామీ ఇచ్చిన ఆరు గ్యారేంటీలను తెలంగాణలో అమలు చేస్తున్నాం. 5 లక్షల వరకు విద్యా భరోసా కార్డు పథకం ప్రకటిస్తాం” అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థను సీఎం కేసీఆర్ ప్రక్షాళన చేస్తున్నారు : మంత్రి మహేందర్ రెడ్డి

వికారాబాద్ : గతంలో పాలకుల నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థను సీఎం కేసీఆర్ ప్రక్షాళన చేస్తున్నారని సమాచార, పౌర సంబంధా శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శివారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో 27,147 పాఠశాలల్లో సీఎం అల్పాహార పథకం అమలు చేస్తామన్నారు. దీని ద్వారా 23 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లాలో నాలుగు పాఠశాలల్లో 602 మంది విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభమైందని, దసరా నుంచి 1052 పాఠశాలల్లో 92,000 మంది విద్యార్థులకు సీఎం అల్పాహార పథకం అమలు చేస్తామన్నారు. మన ఊరు –మనబడి కార్యక్రమంలో జిల్లాలోని 371 పాఠశాలలను రూ.109 కోట్లతో ఆధునికరిస్తున్నాం. మధ్యాహ్న భోజన పథకం గతంలో 9 తరగతి వరకు ఉండేది. ఇప్పటి నుంచి 9,10 తరగతుల విద్యార్థులకు కూడా సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్, ఎంపీపీ చంద్రకళ పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com